నాటకము

ప్రచండ భార్గవము

The Nellore Progressive Union
NELLORE
L. P. HALL



20736

వెల రూ. 1½

కృతికర్త:

మోచర్ల రామకృష్ణయ్య

WORKS BY THE SAME AUTHOR

1. మారుతి (ఆంజనేయ స్తవము) వెల 0-6-0

"మీకవనము మిక్కిలి ప్రౌఢముగాను గంభీరభావ పూర్ణముగాను గనుపట్టి నాహృదయమును మిగుల నానందపరచినది"—

'కవిశేఖర' వద్దాది సుబ్బరాయుడుగారు.

2. రమణానంద లహరి (రమణమహర్షి స్తోత్రము) ,, 0-4-0

3. గంగా లహరి (పండితరాజ - జగన్నాథకవి కృత సంస్కృతకృతికిఁ దెనుఁగుసేఁత) ,, 0-6-0

"మీరు పంపిన 'గంగాలహరి'ని అక్షరముగూడ విడువక కడముట్ట - ముమ్మాఱు - పద్యము పద్యము ముద్దుపెట్టుకొనుచు చదివితిని. పిన్ననాఁటనుండి నాకు గంగాలహరి ప్రియతమమయిన స్తుతి గ్రంథము. అందు పండితరాయని పరిపక్వహృదయము ప్రతిఫలించుచున్నది. ధారాళగతి, నైర్మల్యము గాంభీర్యము పవిత్రత బాహ్యాభ్యంతర కాలుష్యశోధన శక్తి ఆ గంగాలహరికిఁ బోలె మీ గంగాలహరికిని గలదని మెచ్చుకొనుచుందును. పండితరాయని కవనపుమేల్మికి మీరు మెఱుఁగు గూర్చితిరి. మూలము గూడ మీరు ముద్రించి యుండవలసినది."—

'కవిచూడామణి' వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

4. ఆత్మబోధము (శ్రీశంకరాచార్యస్వామి సంస్కృత గ్రంథమున కాంధ్రీకృతి) ,, 0-8-0

5. హంససందేశము (శ్రీమద్వేదాంత దేశికుల రచన కనువాదము) ,, 1-0-0

6. గిరిజాకల్యాణము (గద్యము) ,,

Presented to Chiranjivi

Guntur Seshendra Sarma

With the best wishes

of the author

[illegible]

[illegible]

ప్రచండ భార్గవము

(పరశురామ విజయము)

G. S. RAJA SEKHARAM
THOTAPALLIGUDUR P. O.
NELLORE - 524 311.

20136

కృతికర్త :
మోచర్ల రామకృష్ణయ్య
ప్లీడరు — నెల్లూరు

సర్వస్వామ్యములు
కర్తవి

మద్రాసు
బి. యన్. కె. ప్రెస్సున ముద్రితము
1946

వెల :

ఒకటిన్నర రూపాయి.

ప్రచండ భార్గవము

నాటక పాత్రములు

పురుషులు

సూత్రధారుఁడు.

పారిపార్శ్వకుఁడు.

పరశురాముఁడు—జమదగ్ని కడగొట్టు కొడుకు—కథానాయకుఁడు.

కుమారస్వామి—శంకరుని కుమారుఁడు.

శంకరుఁడు—కైలాసపతి.

భృంగి—శివభటుఁడు.

కార్తవీర్యార్జునుఁడు—హైహయాధీశ్వరుఁడు.

మయూరధ్వజుఁడు—కార్తవీర్యార్జునుని మహామాత్రుఁడు.

శూరసేనుఁడు } కార్తవీర్యార్జునుని యంగరక్షకులు.
వీరవర్మ

ఆక్షేపకుఁడు—వనపాలకుఁడు.

చారుఁడు.

వృద్ధకంచుకి—కార్తవీర్యార్జునుని యంతఃపురవర్తి.

జమదగ్ని—పరశురాముని తండ్రి.

రుమణ్వంతుఁడు
సుషేణుఁడు } జమదగ్ని కుమారులు.
వసువు
విశ్వావసువు

గాలవుఁడు } జమదగ్ని శిష్యులు.
శాలిహోత్రుఁడు }

స్త్రీలు.

గౌరి—శంకరుని కుటుంబిని.

మనోరమ—కార్తవీర్యార్జునుని పట్టమహిషి.

చంద్రరేఖ—మనోరమ సఖి.

రేణుక—జమదగ్ని పత్ని.

భువనమోహిని—కార్తవీర్యార్జునుఁడు సృజించిన యొక లావణ్యవతి.

—— ఇ.

INTRODUCTION

BY

Sri Siromani

SANNIDHANAM SURYANARAYANA SASTRY

Proficient in Oriental Learning,

Telugu Pandit,

Mahabub College, Secunderabad

[Author of 'Tatsama Chandrika', critical commentaries on 'Narasa-bhupaleeyam', 'Jataka Kadha Guchchham', 'Keera Sandesam', 'Vasavadatta' 'Khadga Tikkana' etc., etc.]

ప్రచండ భార్గవము

ఉపోద్ఘాతము

కాంతలకు లావణ్యమువలె, విద్యలకుఁ గవిత్వము ప్రాణము. కావుననే వేదవిదులును గవిత్వమునకై నిత్యమును గృతాభిలాషులగుచున్నారు[1]. శ్రుతి యీశ్వరస్తుతికై ప్రవృత్తమై, శాబ్దికునిగానో తార్కికునిగానో పేర్కొనక పరమేశ్వరుని 'కవి' 'కవి' యని పలుమాఱు ప్రశంసించినదఁట. కాఁబట్టి కవిత విద్యలకుఁ బరాకాష్ఠ[2]యనుట నిశ్చీయమానమగుచున్నది. పండితబృందమునఁ గవికి శ్రేష్ఠస్థానమందు వలన లభించినది. కవి వైదుష్యంశము గలవాఁడనుట సత్యము. ఋషికల్పుఁడైనపుడే బ్రహ్మానందసహోదరమగు రసమును గావ్యమునఁ గవి నిక్షేపింపఁగలుగును. అపుడే కవిచేయు ధర్మోపదేశము[3] లేక సదాచారోపదేశ మానందమూలకమగును. ఈ యుపదేశము శ్రవ్యకావ్యమునందుకన్న దృశ్యకావ్యమునందు స్పష్టగా భాసమానమగును. వినుకలిచే

---

1. ప్రాణాః కవిత్వం విద్యానాం
   లావణ్యమివ యోషితాం
   త్రైవిద్యవేదినోఽప్యస్మై
   తతో నిత్యం కృతస్పృహాః
2. స్తోతుం ప్రవృత్తా శ్రుతిరీశ్వరం హి
   న శాబ్దికం ప్రాహ న తార్కికం వా
   బ్రూతే తు తావత్కవిరిత్యభీక్ష్ణం
   కాష్ఠాపరా సా కవితా తతో నః.
3. "సదాచారోపదేశరూపనిబంధనాహి నాటకాదిగోష్ఠీవినోదాయ జనహితార్థమేవ మునిభి రవతారితా"—ఆనందవర్ధనుఁడు.

నొదవుదానికన్నఁ గనుకలిచేఁ గలుగు నుపదేశము శక్తిమత్తరముగదా! “దృశ్యమునందువలెఁ బదార్థములు శ్రవ్యమునఁ బ్రత్యక్షానుగామి నంతగా నాస్వాద్యమానములు గావు. కావున దృశ్యకవులనే యధికముగా సమ్మానింతు”వని [1]భోజోక్తి. నాటకము సంగీతకవితాభినయముల సంపుటీకరణము. ఇందొక్కటొక్కటియు బ్రహ్మానందమును గూర్చునది. మూఁడునుగూడిన నిఁకఁ జెప్పవలయునా? కావుననే కావ్యములలో నాటకము రమ్యమనిరి. కవిచేయు ధర్మోపదేశము రూపకమందే మిక్కిలి సార్థకమగును గాన ‘నాటకాంతం కవిత్వం’ అను నానుడియుఁ గల్గినది.

రంజనా ప్రవేశాదులచేత సభ్యహృదయములను విచిత్రముగా నటింపఁజేయునది నాటకము.[2] ఇందుఁ బాత్రములు రూపింపఁబడు చున్నవి - అభినయింపఁబడుచున్నవి, యనువ్యుత్పత్తిచేత రూపకశబ్దము నాటక పర్యాయముగా నుపపన్నమైనది - రూపమే రూపకము[3]. అభినయములచే వస్తువెందు రూపింపఁబడునో యది రూపకము[4]. అనఁగాఁ దత్తద్రూపముల నారోపించుకొని యభినయించుట రూపకము[5].

నాట్యశాస్త్రము వేదమనియు నిది చతుర్వేద సారమనియు దీనిని బ్రహ్మ రచించెననియు భరతముని మతము. నాటకము చాక్షుష

1. “తత్ర (ప్రబంధేషు) న తథా పదార్థాః ప్రత్యక్షేణ ప్రతీయమానాః స్వదంతే యథా వాగ్మినాం వచోభిరావేద్యమానాః। అతః అభినయకర్తౄనేవ కవీన్ బహుమన్యామహే”
2. ‘నాటయతి విచిత్రం రంజనా ప్రవేశేన సభ్యానాం హృదయం నర్తయతీతి నాటకం’ — నాట్యదర్పణము.
3. ‘రూప్యంతే అభినీయంతే పాత్రాణి ఇతి రూపాణి నాటకాదీని, రూపమేవ రూపకం’ - నాట్యదర్పణము.
4. ‘రూప్యతేభినయైర్యత్ర వస్తు తద్రూపకం మతం’-దశరూపకము.
5. ‘తద్రూపారోపాత్తు రూపకం’ — సాహిత్యదర్పణము.

క్రతువని కాళిదాస మహాకవి సూక్తి[1]. ఈ క్రతువును చూచుచున్న వారికి లభించు ఫలము[2] మతిమాత్ర ప్రశంసకుఁ బాత్రమై యున్నది.

సంస్కృతాలంకారికులు నాటకము సర్వాంగసుందరముగా నుండుటకై నాటకవస్తువును పంచావస్థాత్మకము (ఆరంభ యత్న ప్రాప్త్యాశా నియతాప్తి ఫలాగమములు)గా విభాగించిరి. వృక్షబీజము క్రమక్రమముగా వృద్ధినొంది యెట్లు ఫలరూపమునఁ బరిణమించునో, యట్లే నాటకకు బీజమగు నది తత్తదవస్థారూపమునఁ గ్రమాభివృద్ధి నొంది తుదికి ఫలరూపమునఁ బరిణమింపవలెను. ఇట్లు వస్తువు భాసిల్లుటకై సంధిపంచకమును వానికిఁ జతుష్షష్ట్యంగములను భరతాదులు సంధానించిరి. కాని లక్షణానుసారముగా సంధులను సంధ్యంగములను లగింపవలయునన్న దృష్టితో రచనగావించిన నాటకము నసిగా నుండునన్నమాట సత్యదూరము. రసాభివ్యక్తికి సహాయపడు సాధనములను మాత్రమే కవి గ్రహింపవలెను. వేణీసంహారమున 'విలాసము' అను సంధ్యంగము శాస్త్రీయమైనను రసోచితముగా లేదని యాలంకారికులు విమర్శించిరిగదా! ఇతివృత్తమును రసానుకూలముగా మార్చుట కాలంకారికులు నిర్దేశించువారు గారన నిర్వివాదము. ఈ ప్రచండ భార్గవ ప్రబంధకర్తయు నితివృత్తమున నలఁతి మార్పులు గావించెను.

'శృంగారో వీర ఏవ వా' అని యుండుటచే నాటకమున శృంగారవీరముల నేదే నొక రసమంగిగాను గడమరసము లంగములుగాను నుండవలెనని భరతాదుల నియమముగా సాహిత్యదర్పణకారాదులు వచించిరి. అట్టిచో ధీరోదాత్తుఁడే నాయకుఁడుగా నుండవలయును. ఇందుఁ బరశు రాముఁడు ధీరోదాత్తనాయకుఁడు. ఇందలి రసము వీరము.

---

1. 'దేవానా మిద మామనంతి మునయః కాంతం క్రతుం చాక్షుషం.'
2. 'ప్రయోగం యశ్చకుర్వీత ప్రేక్షతే చావధానవాన్
యాగతి ర్వేదవిదుషాం యాగతిర్యజ్ఞశాలినాం,
యాగతి ర్దానశీలానాం తాంగతిం ప్రాప్నుయాన్నరః'

పరశురాముఁడు బ్రాహ్మణుఁ డగుట 'ధీరశాంతా వణిగ్విప్రాః' అను సమయము ననుసరించి, యాతని ధీరశాంతునిగానే ప్రదర్శింప వలయుఁగదా యని యొక యాశంక పొడమవచ్చును. కాని పరశురాముని యతిక్రూరత్వము వాఖ్యానించు నిమిత్త మాతఁడు ధీరోద్ధతుఁడుగా వెలయింపఁబడుటయుఁ గావనగును. నాయకుని భాష-ప్రకృతి-వేషాదులకుఁ గార్యము ననుసరించి, యెయ్యెడనైన నతిక్రమము సిద్ధించుట నాటకసామాన్య లక్షణవిరుద్ధము గాదు[1].

ధీరోద్ధతుఁడు నాటకనాయకుఁడుగా నుండవచ్చునా? అనియును నాశంకింపఁ బనిలేదు. నాటకమునకు ధీరోదాత్తుఁడే కాక ధీరలలిత ధీరోద్ధతాదులుగూడ నాయకులుగా నుండవచ్చును[2]. అట్లగుట నిందు ధీరోద్ధతుఁడు పరశురాముఁడు నాయకుఁడైనప్పుడు ప్రధానరసము వీరము గాక రౌద్రమగును. రౌద్రరస మంగియగుట పొసఁగునా యనియు శంకింపరాదు. ఉత్తరరామచరితమునఁ గరుణముఁ బ్రబోధచంద్రోదయమున శాంతము నంగిత్వము వహించియుండుట సుప్రసిద్ధము[3]. ఆశ్చర్యచూడామణియం దద్భుతరస మంగియగుట బుధజనవేద్యము[4].

1. "పరశురామస్య అతిక్రూరత్వ ఖ్యాపనార్థం ధీరోద్ధతత్వ నిబంధః స "భాషాప్రకృతి వేషాదేః కార్యతః క్వాపి లంఘనం". ఇత్యపవాదాదవిరుద్ధః"—నాట్యదర్పణము.
2. "ఏతే తు నాటకస్య నేతారం ధీరోదాత్తమేవ ప్రతిజానతే నతే మునిసమయాధ్వవగాహినః। నాటకేషు ధీరలలితాదీనా మపి నాయకానాం దర్శనాత్ కవిసమయ బాహ్యశ్చ"
—నాట్యదర్పణము.
3. 'శృంగారో వీర ఏవ వా, ఇతిసముచిత రససూచకం తేన ఉత్తర రామచరితే కరుణస్య ప్రబోధచంద్రోదయే శాంతస్యచ అంగిత్వ మవ్యాహతం' —దుర్గాదాస పండితుడు.
4. మహామహోపాధ్యాయ యస్. కుప్పుస్వామిశాస్త్రిగారి యాశ్చర్య చూడామణి పీఠిక.

తెన్నగాఁ బరిశీలించిన నిందలి పరశురాముఁడు ధీరోద్ధతుఁడు గాఁడు. అతిక్రూరత్వ మీతని యందు లేదు. ధీరోద్ధతుని కర్మము అత్యుగ్రము. ఈ నాటకమునఁ బరశురామునికి ధర్మమే ముఖ్యము. ధీరోదాత్తుఁడు ధర్మనిర్వహణమూలమున లోకకల్యాణము ననుసంధించును. పరశురాముఁ డట్టివాఁడు. శంకరుఁడు 'ధార్మిక కర్మదూరధూర్తచ్ఛాత్రుకంఠ వాశనిని కృంతనార్థము' కదా యీతనికిఁ గుఠారమొసంగెను! కావున నిందలి నాయకుఁడు ధీరోదాత్తుఁడే! వీరరసమే యంగి.

నాటకీయవస్తువును బంచావస్థాత్మకముగా విభజించి, యాయా యవస్థ సమాప్తమగుచో నాయా భాగమున [1]అంకమని ప్రాచీనులు పేరు పెట్టిరి. మఱియు నవసరమునుబట్టి, యనఁగా దూరాధ్వగమనము మొదలగు నేకదినసాధ్యకార్యములఁ బ్రదర్శింపవలసిన చో నేని, కథా వస్తువును ఛేదించి చూపించుటయు నంకమే. అంక మన నొక్కదినమున జరిగిన వస్తువును బ్రదర్శించు. అట్లయ్యు నొక్కదినమున జరిగిన వృత్తము నొక్క యంకముననే కాక రెండు మూఁడంకములలోఁ గూడఁ జూపవచ్చును. దీని నే యిప్పటివారు రంగమందురు. రంగము, దృశ్యము అను పదములను బ్రాచీనులీ యర్థమున వ్యవహరింపలేదు. వారు 'రంగము' అను నర్థమునందును 'అంకము' అను పదము నే వ్యవహరించిరి.

భవభూతి యేకాహచరితము నేకాంకముగా నిరూపింపక భిన్న భిన్నాంకములలోఁ బ్రదర్శించెను. ఇంతేకాక యుత్తరరామచరిత్రము యొక్క చతుర్థాంకపుఁ బరిశిష్టమున 'నిష్క్రాన్తౌ వృద్ధవర్గః' అని యారంగమును ముగించి, యదే యంకమున లవుఁడు వటువులతో నశ్వమును

1. అవస్థాయా స్సమాప్త్యర్థా ఛేదోవా కార్యయోగతః
అంక స్స బిందు ర్ద్వ్యాప్తి శ్చతుర్యామో ముహూర్తతః.

2. "The events of the first two Acts occupy one day....... Thus the events of the 3rd, 4th and 5th Acts occupy one day and one night... Thus it is clear that the events of the 7th and 8th Acts must have happened on the 7th or 8th day of the dark half of jyeshta......etc.

M. R. Kale's Introduction to Malathi Madhava.

గాంచి దానిని బంధించు దృశ్యమును గవి ప్రదర్శించెను. వీనినిబట్టి, యొకే యంకమున నేకాహచరితమునే, దూరాధ్వగమనాదులు లేని విధమున భిన్నభిన్నరంగములుగాఁ జూపవచ్చునని మనమూహింపవచ్చును. కాని నిది ప్రాచీనలక్షణ విరుద్ధము గాదు. పెక్కుదినములందు జరిగిన చరితము నొక్కయంకమునఁ జూపుటమాత్రము సంప్రదాయ విరుద్ధము.

ఈ నాటక బీజమేమి? అదియెట్లు ఫలముగాఁ బరిణమించెను? ప్రథమాంక ద్వితీయరంగమున శివుఁడు పరశురాముని క్రౌంచభేదన కౌశలమునకు మెచ్చి, ధార్మిక కర్మదూరులగు నుద్ధత నరపాలకుల కంఠఖండనమునకు సాధనమగు కుఠారము నతనికిఁ బ్రసాదించుట బీజము. అది ఫలించుటకు సహాయము పరశురాముని పితృక్రీడ. ఈ నాటక బీజము స్త్రీయాత్రికాగారాంతము ప్రవేశించు పరశురాముని స్వగతమునఁ గొలఁదిగాఁ బ్రారంభించి, గొంతుక మెట్టునని కోపించిన యతని ప్రతిజ్ఞతో ప్రాణముగట్టి, మనోరమాస్వప్నసందర్శనరూపమున శాఖలుగట్టి, సేనాని కార్తవీర్యుని కంపిన జాబునం గల వృత్తాంతరూపమున మొగ్గతొడిగి, మయూరధ్వజుని కదనకథనమునను గార్తవీర్యార్జునుని స్వగతోక్తిరూపమునను బుష్పించి పంచమాంక చతుర్థరంగమున ఫలించినది. ఈ విధమున ధర్మనిర్వహణము చేయఁబడినది. ప్రచండభార్గవమున మొదటి యంకమందలి రెండురంగములు నొక్కదినముననే జరిగినవి. ఆవలఁ గొలఁదికాలమునకే యనఁగా రమారమి వారముదినములలోనే ద్వితీయాంక కథయు జరిగియుండును. అది ముగిసిన మఱునాఁడే తృతీయాంక కథయుఁ దదనంతరదినముననే చతుర్థాంక కథయు దాని వెంటనే పంచమాంక కథయు జరిగినది. ఈవిధముగా నీ యితివృత్తమునకుఁ బదిపన్నెండుదినములుమాత్రమే పట్టియుండును.

ఈ నాటకమున రంగము లతివిస్తృతములుగాక సముచితసంగ్రథితములై రసవంతములై యున్నవి. పరశురాముని పరాక్రమ బ్రహ్మ

చార్యమర్యాదలును శాస్త్రపర్యాప్తముని ఔద్ధత్యమాయాశిత్యములును జక్కఁగా నిరూపింపఁబడినవి.

ఆంధ్రమున రూపకలక్షణమును గూలంకషముగా నిర్వచించు గ్రంథము లేదు. ఆంధ్రదశరూపకమునఁ గాని, యాంధ్రసాహిత్యదర్పణమునందలి నాటకప్రకరణమునఁ గాని తల్లక్షణములకు లక్ష్యములు లేవు. కాన వానియుపయోగ మాంధ్రులకు శూన్యమే. భిన్నభిన్నగణములుగల నాటకాదులలో సంధులు తదంగములు సమన్వయమగునట్లు చూపఁబడలేదు. ఇంతేకాక యీకాలమున నిటుఁ దారసిల్లిన పాశ్చాత్య నాటకముల విమర్శించి మననాటక సాంప్రదాయము నావిష్కరించు తలంపున నేను ప్రారంభించిన 'రూపక సమీక్ష'కీ యుపోద్ఘాత ముపోద్ఘాతరూపము గుఁగాక.

కవిగా నటుఁడుగాఁ బ్రసిద్ధి వహించినవాఁడే నాటకరచయిత కాఁదగినవాఁడు. ఇంగ్లండున షేక్స్పియరు కోవఁబడినను నాటకరచనమునకు నెంతికి యేర్పడును. శ్రీ రామకృష్ణశాస్త్రిగారు 'నటకవి'గా నటుమాత్రుఁడుగా నాంగ్లవిద్యాధికుఁడుగా కలిసిన సామగ్రి సముపార్జించుకొన్నవారు. వీ రాంధ్రాంగ్లభాషాదులయందు నేఁటికాలపు విలక్షణకవిత్వపుఁ బోకడలకుఁ బోక, సలక్షణమైన లక్ష్యములకు కవిత్వము వ్రాయుటకుని సంపాదించిరి. పరార్థపరులై యొకప్పుడు లక్ష్మీదేవిని భాషాసేవకులై యొకప్పుడు సరస్వతీదేవిని సేవించుచు నిరువురి యనుగ్రహమునకు పాత్రులై మన్ననఁగని జన్మమును ధన్యము చేసికొనుచున్నారు. వీరికి విశ్వమునందు నా కాదరముగలదు. వీరి సహకారమున నెక్కుడుగా నాశించినది.

వీరిట్లే యుత్తమగ్రంథముల రచించి, భాషాసేవచేయుచుఁ జిరకాల మాయురారోగ్యసంపదలతో వర్ధిల్లుదురు గాతమని పరమేశ్వరుఁ బ్రార్థింతును.

44. Zeera Compound,
Secunderabad,
Deccan.

సన్నిధానము
సూర్యనారాయణశాస్త్రి.

[ఈ యుపోద్ఘాతము రచించిన శ్రీ శాస్త్రులవారి కెంతయుఁ గృతజ్ఞుఁడను.
గ్రంథకర్త.]

శ్రీ

ప్రచండ భార్గవము

నాంది

శ్రీకంఠాత్త వరప్రభూత బలపారీణుఁ డణోద్దండ ఖ
లాకంఠా ఖరదోస్సహస్ర జయలోల ప్రాణబాణుఁ ఘనా
నీకక్షోణి జయించు కృష్ణుఁడు సమానీతానిరుద్ధత్రిలో
కీకల్యాణ కటాక్షముల్ వఱపి రక్షించుఁ మిమ్ముఁ నిత్యముఁ

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు:— అతి విలంబమేల, వినియెదంగురుగదా.

సీ॥ మోచర్లకుల సముద్భూతిఁ బుట్టువుతోన
తొడరిన కవితా కుతూహలంబు

* అభినవ తిక్కనార్యు భజించి, తత్కృపా
మహిఁగన్న పద్య నిర్మాణపటిమ

† శివరామయాఖ్యు చేరువ ‘నాంధ్ర సభ’ నట
త్వావాప్తిఁగొన్న రంగానుభవము

శ్రవ్యమ్ము మెచ్చి, దృశ్యప్రబంధపు సృష్టి
కెలయించినట్టి నెచ్చెలులప్రోది

---

* బ్రహ్మశ్రీ [illegible] గారు.

† నెల్లూరు ఆంధ్రసభకు నాఁటి అధ్యక్షులు శ్రీ తూములూరు శివ
రామయ్య గారు.

సీ॥ కారణంబులు నుద్బోధకములుగాఁగ
'సరసకవి' రామకృష్ణుండు సంతరించె
నీ ప్రచండ భార్గవము మీ రెలమిఁ జూచి
మేలు గలదేని గొనుఁ డార్యమిత్రులార!

కార్యవశమున నేనిప్పుడు హిమవన్నగవాసినయి బాలభార్గవ సమాకాలికుఁడనైతిని. (అంతటఁ గలయంజూచి) ఓహో! యేమిది? భక్తవశంకరుఁడగు శంకరుని యావాసముగదా యిది! భార్గవ బాహులేయుల శరాభ్యాస కోలాహల మొక్కింతయును లేక యేల యీశైల సానుస్థలంబులు నిశ్శబ్దంబులై యున్నవి?

[పారిపార్శ్వకుఁడు ప్రవేశించును]

పారి—భావా, యెఱుంగవా యేమి? భృగునందనస్కందు లెన్నఁడో కృతహస్తులైరి. నేఁడో రేపో భార్గవుఁడు హిమగిరినుండి పయనమై తన జననీజనకులం జేరగలఁడు.

సూత్ర:— మారిషా, నాకొక్క సంశయము. 'కోదండ పాండిత్యమున వారిరువురిలో నెవ్వఁడధికుఁడు?' అని.

పారి:— [illegible]. ఇప్పుడే నీకయ్యది స్పష్టము కాఁగలదు.

[నేపథ్యమున]

మ॥ పరమేశోజ్జ్వల పాదపంకజ రజస్స్ఫూర్త్యాతిపూతంబు, భీ
కర దుర్వార మహాఘ సంహరణదక్షం బిద్ధకైలాస, మీ
గిరిమాహాత్మ్యము నాసహస్రముఖుఁడున్ గీర్తింపఁగా నేరఁ డీ
శ్వరు నిందుండియె కొల్చు నాకిఁక బునర్జన్మంబు లేదారయన్.

సూత్ర:— (చెవియొగ్గి) భార్గవుఁడు ప్రవేశించుచున్నాఁడు. వేగిరము పోవుదము రమ్ము. కడమ పాత్రము లాయత్తమొనర్తురు పద.

(నిష్క్రమింతురు)

[ఇది ప్రస్తావన.]

ప్రచండ భార్గవము

ప్రథమాంకము - ప్రథమ రంగము

(స్థలకము - కైలాసము)

[భార్గవుఁడు ధనుర్బాణ తూణీరధారియై ప్రవేశించును]

భార్గవుఁడు:—

మ॥ పరమేశోజ్జ్వల పాదపంకజ రజస్స్ఫూర్త్యాతి పూతంబు, భీ
కరదుర్వారమహాఘసంహరణదక్షం బిద్ది కైలాస, మీ
నగ మాహాత్మ్యము నాసహస్రముఖుఁడున్ గీర్తింపఁగా నేరఁడీ
శ్వరు నిందుండియు గొల్చునాకిఁకఁ బునర్జన్మంబు లేదారయన్!

పినాకపాణి యంతేవాసినై, యస్త్రశస్త్రాభ్యాసమొనర్చుచు, మయూరతురంగుని తోడంగట వినోదించుచు, శర్వాణీ చరణారవింద మరంద పానానంద తుందిలేందిందిరంబనై హిమగిరి సానువనస్థలంబుల విహరించుచు నింతకాలము సంతసంబున బుచ్చితి. నిన్నగదా యన్నీల లోహితుండు "భార్గవా, శేముషీవిశేషంబునను గోదండపాండిత్యంబునను నీవు మాననీయుండవైతివి. నీవు కోరినప్పుడు నిజజననీజనకులం జేర వచ్చును. నీకు సెలవిచ్చితి"నని యానతిచ్చెను. పుణ్యనిలయమగు నీధరాధరవరేణ్యమును నే నెట్లు విడిచిపోఁగలను? పోఁగలిగినను,

ఉ॥ ఇంపుదలిర్చు నాదయిననయ్యుమతొలిప్రాయపుఁగౌతుకాబ్ధిపొం
గింప సుధామరీచియగు కీర్తినికాయుని గార్తికేయునిన్
బెంపెసలార కూరిమికిఁ బుట్టినయిల్లగునట్టి నెచ్చెలిన్
దెంపున వీడిపోవలసెనే యని యుల్లము తల్లడిల్లెడిన్.

[చేప్పుడు సేయని యడుగులతోఁ, గోదండకాండసమన్విత కరకమలుండగు కుమారస్వామి వెనుకనుండి వచ్చి భార్గవుని భుజముమీఁదఁ జేయి వేయును. అతఁడులికిపడును.]

కుమారస్వామి:—ఏమిభార్గవా, యేమేమో నీలో నీవు మాటాడుకొనుచున్నావు ?

భార్గ:—ఏమియును లేదు. మిత్త్రుని విడనాడవలసినదినములు వచ్చెనుగదా యని చింతించుచున్నాను.

కుమార:—సఖుఁడా, సంయోగవియోగములు సహజములుగదా ! నీయెడఁబాటు నాకును దుస్సహమే యగును. కాని నివాసములు దూరములైనను మన యంతఃకరణములు దూరములగునా ?

[శివభటుఁడు భృంగిప్రవేశము.]

భృంగి:— కుమార భృగురాములారా, మీయిరువురిని వేగిరమ వెంటఁబెట్టుకొని రమ్మని మహేశ్వరునియాజ్ఞ.

భార్గ:—సఖుఁడా, పోవుదము రమ్ము.

కుమార:—అటులే. (ముగ్గురు నిష్క్రమింతురు.)

(తెర వ్రాలును.)

ప్రచండ భార్గవము

ప్రథమాంకము - ద్వితీయ రంగము

(స్థలకము - కైలాసము)

[గౌరీశంకరులు ఉపవిష్టులై యుందురు]

గౌరి:— మీ రన్నమాట నే నంగీకరింపఁజాలను. కుమారునికన్న భార్గవుఁడే ధనుర్విద్యయం దధిక నైపుణ్యమును గడించెనన్న మీ మాట విశ్వసింపఁజాలను.

శంకరుఁడు:— ప్రత్యక్షముగ నిరూపించిన నీ వంగీకరింతువా?

గౌరి:— విధిలేదు. మన ప్రేమాల వారి శస్త్రవిద్యాపాటవము ప్రదర్శింపఁబడినచో నప్పుడు మన వాదములయందలి సత్యాసత్యములు బలాబలములు స్పష్టమగును.

శంకరుఁడు:— నిస్సందేహముగ - త్వరపడకుము.

[భృంగి భార్గవ కార్తికేయులు ప్రవేశింతురు. భార్గవ కార్తికేయులు గౌరీశంకరులకు నమస్కరింతురు.]

శంకరుఁడు:— చిరంజీవులారా, మీ శరాభ్యాస పాటవముం బరీక్షింప మాకు మనసు పుట్టినది. మీమీ ధనుర్విద్యాకౌశలముం బ్రకటించి, యల్లదే యీ క్రౌంచమును నొక్క బాణముతో నొక వైపు నుండి యావలిప్రక్కకు రంధ్రము గావింపవలయు. ఉపక్రమించి నా యాదేశము నిర్వర్తింపుఁడు.

భార్గవ కార్తికేయులు:—మహాప్రసాదము (ఇరువురు నిష్క్రమింతురు)

గౌరి:— ఇట్టియాజ్ఞ యొసర్తురని నేఁ దలంపలేదు.

శంకరుఁడు:— ఎట్టి పరీక్ష యుచితమని యూహించితివి?

గౌరి:— పాండవమధ్యముని భండన పాండితిం బరీక్షింప నలనాఁడు మీరు సంఘటించిన విధానముంబోలిన పన్నుగడ యొకటి పన్ను దురని భావించితిని.

శంకరుఁడు:— క్రౌంచభేదన పరీక్షయే మేలు. ప్రాణప్రియా, యిదే నామాట వెంబడిన లక్ష్యవేధన మారంభింపఁబడినది.

గౌరి:— చూచుచున్నాను. అదిగో!

సీ॥ శరము కార్ముకమున సంధించె కుమారు
సుప్రయోగ విశిఖుఁ జూడుఁ డదిగో,
చెదలరేఁగె సురల జయ జయ ధ్వనులలో
వాని బాణరవము లీనమయ్యె!

శంకరుఁడు:-[చిఱునగవుతో] (స్వగతము) పుత్త్రప్రేమప్రభావ మిట్టిదే కాఁబోలు (ప్రకాశము) ప్రేయసీ, చూచుము, కుమారుని నారాచము నగమును భేదించునన్న నమ్మకము కలుగుటలేదు. జాగరూకతతో మఱియొక బాణము నాతఁడు ప్రయోగింపవలసిన ట్లున్నది.

గౌరి:—తొలిప్రేటు తప్పిపోయినఁ బోవునుగాక. రెండవబాణమైన భేదింపకుండునందురా?

శంకరుఁడు:—రెండవది దూసిపోయిన, మూఁడవదానిని సైతము ప్రయోగింపవలసివచ్చునేమో!

గౌరి:—బాలకులపట్ల నంతమాత్రము చేసవునూపఁదగదా?

శంకరుఁడు:—ఏకబాణప్రయోగముచేతనే క్రౌంచమున రంధ్రము గావింపవలయునని మొదట నేనాడితినిగదా! ఇప్పు డది సవరించు టెట్లు పొసంగును?

గౌరి:—(ఉద్వేగముతో) అయిన మనకుమారుఁ డోడిపోయినట్లేనా?

శంకరుఁడు:—భృగురాముఁడు గెలిచినఁగదా?

గౌరి:—అతఁడును క్రౌంచభేదనము చేయఁజాలనిచో ?

శంకరుఁడు:—ఇరువురును తుల్యప్రజ్ఞులని యేర్పడును.

గౌరి:—అట్లయిన సంతోషమే !

శంక:—ప్రియా, తిలకింపుము. భార్గవుఁ డుపక్రమించుచున్నాఁడు. అతని శరసంధానముం గనుము.

క॥ పంచాస్యమధ్య యట్లుఁ
కాంచుము భృగురాము శరాగతి కిపు డేమగునో
క్రౌంచము కంపించెనో, భే
దించునొ యేమో యతండు దీని శరాసనా !

గౌరి:—ఏమో !

శంక:—చూడుము, మెఱపు మెఱసినట్లు భార్గవబాణము మహావేగమునం బోవుచున్నది.

గౌరి:—(తదేక దృష్టితో) క్రౌంచమును దాఁకినది. ఆహా! యదృశ్యమైనది. (చప్పట్లు చఱచి) భేదించినది. అటువైపునుండి వెడలివచ్చినది. ఔరా, యేమి! భృగురాముని శస్త్రప్రయోగకౌశల మద్భుతముగానున్నదిగదా! (విభ్రాంతయై చూచును)

శంక:—కంటివా యీయబ్బురము! ఈ క్రౌంచమును భృగురాముఁడును నేకబాణ ప్రయోగమున రంధ్రముగావింపఁ జాలఁడని తలంచితిని.

గౌరి:—చాలుచాలు మీ చతురవాక్యాలు. చిత్రచర్యానిధులన్న మీరే! మీ సంఘటనముల యంతరార్థములు నాకే గోచరింపనీయకున్నారే, యౌరా! మీ మాయలమారి చెయ్వులు మానవమాత్రుల కర్థమగునా?

శంకరుఁడు:—కల్యాణీ, యేటికీ నీకీయలుక? కుమారుఁ డోడిపావునని నేను మాత్రము తలంచితినా?

[భార్గవరామ కుమారస్వాములు ప్రవేశింతురు - శంకరుఁడు లేచి భార్గవుని గాఢాలింగన మొనరించుకొని చుబుకముం దడవుచుఁ జేరువం జేర్చుకొనును. కుమారుని గౌరి చేరంజీరి యనునయించును. కుమార స్వామి తల్లిని వీడివచ్చి తన కరమున భార్గవుని కరముంజేర్చును].

కుమారస్వామి:— నా సతీర్థ్యుఁడు కూర్మిసఖుఁడు భృగురాముఁడు నేఁటి పరీక్షలో విజయలక్ష్మిం జేపట్టెను. ఈ వీరకుమారుని సముచిత లీల మీరు సమ్మానింపవలయు.

[భార్గవుఁడు గౌరికిఁ బ్రణమిల్లును. గౌరి యాతని లేవఁదీయును.]

గౌరి:— మేలు మేలు భృగురామా, నీ లక్ష్యశుద్ధి యనన్యసాధ్యము. నీ బాహుబల మప్రతిద్వంద్వము. చిరంజీవివై వర్ధిల్లుము.

సీ। ఒక్క నారాచనఖముతో నురవణంచి,
క్రౌంచ కుంభీంద్ర కుంభంబు చించిచీల్చి,
యంచే ముత్తెమ్ములను వెల్వరించి నట్టి
హరివిగాని, మనుష్యుండవా ? కుమార !

శంకరుఁడు:— సంతసించితిని భృగురామా, నీ ధనుర్వేద విద్యావైశ ద్యమునకు నాయభినందనము. నీకు బహుమాన పురస్సరముగా నేఁడీ పరశువు నొసంగుచున్నాను.

ఉ। ఇచ్చితినోయి భార్గవ, గ్రహింపుము-ధార్మిక కర్మదూర భూ
భృచ్ఛయకంఠనాళవినికృంతనసారము నీ కుఠారముం,
సచ్చరితుండవై గుణవిశాలుఁడవై పితృవాక్యభక్తిని
ర్యచ్ఛిరకీర్తివై పరశురాముఁడవై మనుమయ్య దీనిచేఁ !

గౌరి:— నాయనా నీ చరిత్రము విచిత్రము.

గీ॥ ఖండపరశువు కూర్మి శిష్యుండనైతి
వా మహాత్ముని సాన్నిధ్య మందు దక్షుండ
నైన కోదండపాండిత్య ములవడఁగ
పరశురాముఁడ నైతి నబ్బురము నన్నె!

శంక:—ఇదే శుభముహూర్తము—పయనమై నీజననీజనకులం జేరుము.
వారు నీరాకకై నిరీక్షించుచుందురు.

పరశురాముఁడు:—మహాప్రసాదము.

(కుమారస్వామిని సమీపించి) దయాస్వా, నేఁబోయివత్తును. నిను విడిపోవ కాళ్ళాడకున్నవి. నను మఱవవుగదా! క్రౌంచభేదనపరీక్ష మాత్రము మఱచిపొమ్ము. లోకగురుసానతి యనుల్లంఘ్యమగుట నందుల కీయకొంటినిగాని కానిచో నేనట్టిపరీక్షకు నీతో నా పోటికి నిల్చుట?

కుమారస్వామి:—పరశురామా, ఇంతమాత్రము నీవొత్తిగొనవలయునా?
దానినప్పుడే మఱచిపోయితిని పొమ్ము. నీకు శుభమగుఁగాక.

(తెర వ్రాలును.)

ప్రచండ భార్గవము

ద్వితీయాంకము _ ప్రథమ రంగము

స్థలకము - మాహిష్మతీ నగరము - ప్రమదావనము

[మనోరమా చంద్రరేఖలు ప్రవేశము]

మనోరమ:— చంద్రరేఖా, మొన్నమొన్న మనము వింధ్యాచలము సమీపమున కరిగినప్పుడు కాంచిన వనము దాని రామణీయకము నాకిప్పటికిని మఱపురాకున్నది.

చంద్రరేఖ:— వనరామణీయక విలోకనము, నర్మదా నిర్మల జలక్రీడా వినోదము - వీనితోపాటు పదితలల రక్కసునితోఁ బోసంగిన సమర కోలాహలమువలని భయము జ్ఞప్తికి వచ్చుటలేదా? బాల్యమున నీవు ధనుర్విద్య నభ్యసించినదానవే, యానాఁ డేల బేలవై భీతినొందితివి ?

మనోరమ :— ఇఱువదిచేతుల రాకాసిమన్నినితోఁ, బోరుసల్పుటకు వేయిచేతుల ఱేఁడుండఁగా మనకేమి భయమని యనుకొంటినిగాని హృదయము నెంత చిక్కఁబట్టినను నా కిప్పటికిని బెదరు వదలినది కాదే! అది తలంచుకొనిన గుండియలు జల్లుమనుచున్నవి, చంద్రరేఖా,

మ॥ క్షయకాలోగ్ర నిటాలలోచనశిఖాకల్పస్ఫుర చ్చాపల్య దు
ర్జయులై, యూర్జితసింహగర్జనలతోఁ గ్రవ్యాదనాథుండు హై
హయవంశాగ్రణియుఁ బరస్పరజిగీషాయత్త చేతస్కులై
భయదాయోధన కేళిసల్పుట తలంపన్ మేను కంపించెడిన్.

చెలీ, రమ్ము నా యురమ్మెట్లు కొట్టుకొనుచున్నదో చూడుము.

చంద్రరేఖ:— (మనోరమ యురము స్పృశించి) అవునే, యీస్పంద
నము నాపై నిన్ను నిస్తంద్రం జేయుటకు నీ మనోహరుఁడు వేయి
చేతులతో నిన్నాశ్లేషింప వలసినట్లున్నదే.

మనోరమ:— చాలు పోవే నీ పరిహాసము.

చంద్రరేఖ:— పరిహాసమా, యణిమాదిసిద్ధుల నార్జించిన నీవిభుండు తన
యిచ్ఛవచ్చిన సమయములందు మాత్రమే వేయిచేతులను వెల్వఱచు
చుండుఁబట్టి సరిపోయె, లేకున్న నీవు నీమనోహరుని జూచినను
భయభ్రాంతవై పరుగెత్తియుందువేమో !

('చంద్రరేఖా !' యని నేపథ్యమున ధ్వని)

ఎవరో పిల్చుచున్నారు. నేఁబోయివత్తును.

మనోరమ:— పోయిరమ్ము.

(చంద్రరేఖ నిష్క్రమించును. మనోరమ పాటపాడుకొనుచు లతానికుంజములవంకకుఁ బరిక్రమించును. పొదరింట్లో నేమో వెదకుచు నాక్షేపకుఁడను వనపాలకుఁడు ప్రవేశించును.)

మనోరమ:— ఏమోయీ, తోఁటపొదలలో నేమో వెదకుచున్నావు ?

ఆక్షేపకుఁడు:— పెంపుడు గోరువంక యొకటి తప్పించుకొని పారి
పోయినది తల్లీ.

మనోరమ:— ఏల ? ఏమి జరిగినది ? ఏ గోరువంక ?

ఆక్షేపకుఁడు:— ప్రొద్దునఁ బెంపుడుపులుఁగుల గూళ్ళు బాగుచేసితిని.
పరిశుభ్రపఱుచుటకై పావుగడియ క్రిందట మాలతీమండపములోని
పైఁడిపంజరము తలుపుతీసితిని.

మనోరమ:— అవును. అందు విశేషమేమున్నది ? అనుదినమును నీవు
చేయుపనియేకదా యది ?

ఆక్షేపకుఁడు:— వినుము తల్లీ, తలుపుతీయుటయే తడవుగా నందున్న
చిలుక-గోరువంక, యివి రెండును వెలికివచ్చినవి. జంటబాయు

నివిగబాఱువి ? విడివడినవి. చిలుక మండపముమీఁది కెగిరినది. గోరువంక యెలమావిచెట్టుపై వ్రాలినది.

మనోరమ:—ఆ! ఆ! అంతట ?

ఆక్షేపకుఁడు:— నేను పంజరము బాగుచేసి, నళ్ళిన పూలపందిళ్లు చక్కఁ బఱచుచుంటిని. అమ్మా, యింతలో నెచ్చటినుండివచ్చెనో, యావాయిచుక్కవలె ఱివ్వున నొక సాళువము దూఁకి, చిలుక నొడిసి, తన్నుకొని మింటి కెగసిపోయెను.

మనోరమ:—అయ్యో, అయ్యో,యెంత దురంతము! శారిక యేమయ్యెను?

ఆక్షేపకుఁడు:—గోరువంక యవస్థ నేనేమని వర్ణింపఁగలను? మండలాకారముగా మండపము నాల్గువైపులఁ దిరిగితిరిగి, పలవరించి, యూఁడిపోవునట్లు ఱెక్కలల్లార్చి, 'లోనికేగి, మరలివచ్చి, తలక్రిందై, విసివి, వేసారి, యేడ్చి, నిలువఁజాలక, ఋజ్జున నెట్లో యెగిరిపోయినది. ఎచ్చట వెదకినను గానరాలేదు దేవి

మనోరమ:— ఎంత యన్యాయము !

ఆక్షేపకుఁడు:— ఇట్టి విపర్యయ మిప్పటికి జరుగలేదు తల్లీ !

మనోరమ:— పొమ్ము, వనము నల్దెసలనుగాలించి చూడుము.

ఆక్షేపకుఁడు: —చిత్తము - నాశక్తి వంచనచేయక వెదకెదను.

(నిష్క్రమించును)

మనోరమ:—ఔరా, యీ వృత్తాంతము నాయంతరంగము నెంత కలఁత నొందించినది !

(సేవకుఁడు ప్రవేశించును)

సేవకుఁడు:—అమ్మా, చక్రవర్తిగారు దయచేయుచున్నారు. (సేవకుఁడు నిష్క్రమించును)

(కార్తవీర్యార్జునుఁడు ప్రవేశము)

మనోరమ:— ఆర్యపుత్త్రునికి జయమగుఁగాక ! ఎచ్చటికో ప్రయాణోన్ముఖులైనట్లున్నది ?

కా_ర్త:— వేటకై యరణ్యమునకేగు సన్నాహమున నున్నాను.

మనో:— నేనును మీతో వచ్చి, వనదృశ్యములతో పాటు మీ మృగయా వినోదముం దిలకింపవలయునని కుతూహలపడుచున్నాను.

కా_ర్త:— ఈనాఁడు నీ వెట్టి యపూర్వపుఁ గోరికం గోరితివి?

సీ॥ రత్నకుట్టిమము విహారస్థలుల్ లేవట
కర్కశకంటక మార్గములె కాని,
రమణీయ కేళికురంగముల్ లేవట
దారుణ వన్యసత్త్వములె కాని,
కర్పూర మణిదీపికా ద్యుతుల్ లేవట
గహనాగ్ని విస్ఫులింగములె కాని,
తతహంసతూలికా తల్పముల్ లేవట
శ్రమముగొల్పు గండోపలములె కాని,
గీ॥ భీకర క్ష్వేళ దుష్టసర్పాకరముల
బహుళ ఘూత్కారములె కాని, వరవిపంచి
కా రవాంచిత గీతాదికములు లేవు
చాన, నీవేల, విపిన సంచార మేల!

మనోరమ:— మనోరమణా, మీతోడి విపినసంచారమైనను హృదయంగమమై యుండును. ఇంక మీయెడఁబాటు నొక్క దినమేనియు సహింపఁజాలను. నేను మీతో వత్తును. అనుగ్రహించి యనుమతింపవలయు.

కా_ర్త:— బేలా, యిదియేటి మాట? ఎంత వెఱ్ఱిదానవు. ఒకటి రెండు దినముల యెడఁబాటునే సహింపలేవా?

గీ॥ ధవుని ధనమైన క్షత్రియోత్తమకు నీకు
వీరపత్నికి వెఱపుగల్పించు నొక్కొ,

కాలగతిఁగల్గు విప్రయోగమ్ములైన,
రణములైనఁ దదీయమారణములైన ?

మనోరమ:— అమంగళము శాంతించునుగాక ! అయ్యో,

గీ॥ అశనిపాతమ్ములుగ నిట్టి యశుభవాక్య-
లడరె మీనోట - విధి యలంఘ్యము నిజమ్మొ,
యైన, నస్తంగమించు సహస్రకరుని
ననుగమించుచోట ఛాయ కాయాస మగునె ?

కార్త:— క్షత్రియ పత్నుల చిత్తస్థైర్యమును నీ జ్ఞప్తి కెలయించుటకై నేనూఱక మాటవరుస కంటిఁగాని, యింతలో నీవి ట్లుమ్మలింపఁదగునా ? వేటకై పోవు నేను రేపే మరలిరానా, యలివేణీ! నీవావంత యేని వంతకుఁ దావీయవలదు పోయివత్తును.

మనోరమ:— జాగుసేయుదురేమో, మీరేమన్నను వనస్థలీ సహజ సౌందర్యము లెంత చూచినను దనివి తీఱునవికావు.

గీ॥ శబరసారంగ దృగ్విలాసములు, శాంత
ముని జనాశ్రమ సుమనోవిభూతి కలిత
సురభిసౌభాగ్యములు మనోహరము లచటి
దృశ్యములు మిమ్ము కదలిరానీయఁగలవె ?

కార్త:— చేలా, యేల యీ మాటలు ?

సీ॥ అరవిందగంధి, నీ యనుభూతిగల నాకు
వనసూన సురభి సంభారమేల ?
హరిణాక్షి, నీ యపాంగాద్యుతి గల నాకుఁ
గాంతార మృగ విలోకనములేల ?

వనిత, నీప్రణయ విభ్రమరేఖగల నాకు
శబరాంగనా విలాసమ్ము లేల?
చెలువ, నీ శృంగార విభవమ్ము గల నాకు
మునిజనాశ్రమ శుచి సఖ్యాత్రి గోల?
గీ: నా మనోరమ యుండంగ నేమిగోరి
యీ వనీరమ పొందు నే నాలసించెదు?
నాకు నీకన్న సేచనకము గలదె,
తెంపుఁబోయిన వెంగరానే, లలన!

(ఇరువురు నిష్క్రమింతురు. తెర వ్రాలును)

ప్రచండ భార్గవము

ద్వితీయాంకము - ద్వితీయ రంగము

(స్థలకము - జమదగ్ని యాశ్రమము)

(గోదేవతాస్తుతి రూపకమగు గేయముం బాడుచుం, బసుపు కుంకుమల యలంకారములతో హోమధేనువును సింగారించుచు, గంధాక్షతలతో బూజించుచు రేణుక ప్రవేశము - రెండు గేయపాదము లామె పాడిన పిమ్మట రుమణ్వంతుఁడొక పచ్చికమోపుం గొనివచ్చి దాని ముందుంచును. సుషేణుఁడొక పాత్రమున జలముం గొనివచ్చి దాని చెంతం బెట్టును. వసు విశ్వావసు లడవి మల్లియ పూదండలం దెత్తురు. ఒక హారమున వసువు దాని కంఠము నలంకరించును. విశ్వావసువు మఱియొక హారమును దాని శృంగములం గీలించును. నలువురు కుమారులును రేణుకయు గేయము నైకకంఠ్యముగాఁ బాడుచుందురు. నిశ్శబ్దముగా జమదగ్ని మహర్షి ప్రవేశించి యానందముతోఁ జూచుచుండి గేయము పూర్తియైన పిమ్మట ధేనువును సమీపించును).

జమదగ్ని:— అమ్మా, గోదేవతా,

మ॥ చివురుం జేవురు మేనిసోకోలయుఁ, గించిద్వేల్లితస్ఫూర్తితో
నవదాతద్యుతు లీను నెన్నొసటి రోమాంకంబుతో, వెల్గు
నీవపురా, క్రొన్నెలరేకఁ దాలిచిన సంధ్యాదేవి వే తల్లి, నీ
కివిగో నేనొనరింతుఁ గైకొనుము మాహేయీ! నమ
స్కారముల్

[అందఱును ప్రదక్షిణము చేయుదురు. తెర వ్రాలును.]

ప్రచండ భార్గవము

ద్వితీయాంకము - తృతీయరంగము

(స్థలకము - అరణ్యము: కార్తవీర్యార్జునుఁడు మయూరధ్వజుఁడు ప్రవేశము)

కార్తవీర్యార్జునుఁడు:— ఇప్పటికి మనము మాహిష్మతీ పురరాష్ట్రపు సరిహద్దులు దాటి వచ్చినను ముచ్చటైనన్నంతయు గని గని యుంగని మనోజ్ఞంబగు వనాంతమును జేరితిమి నన్నో

సీ॥ శ్రుతి పుటంబులు సోకి కామ్యాశయముఁ గురియు
గామ్యాలను దారుమిన్న శకుంతతతులు,
బెడిదముగు వేఁట వేసట సడలఁగాఁగ
మెల్ల మెల్లనఁ గమ్మ తెమ్మెరలు వీచె.

మయూరధ్వజుఁడు:— నిజమే, యిప్పటికి వనదేవతలు నూతనాగతులగు సార్వభౌములకు మీకు శుకపికధ్వనులతో సుస్వాగతమొసంగి, దివ్య పద్యావళితోఁ గైమోడ్పులు కేమిడుచున్నారు ప్రభూ!

కార్త:— వయస్యా, నిజము. ఈ వనోపాంత మాధుర్యముల కాలవాలముగా నున్నది.

మ॥ ఇదిగో నా పొదవైపు చూడఁగదవో
యీ యా, పోయి పాలిచ్చుచు
న్నది ముద్దన్నె మొకమ్ము, దానికడ న
త్యాసక్తితోఁ ద్రావుచు
న్నది లేఁ ద్రాయపు లేడి - చిత్రమిది, చెం
తఁ బుల్య్యోమున్యాశ్రమం
బెదిరియుండవలె న్నిడెంబు : కతమూ
హింపంగ వేఁకున్నదే!

జమదగ్ని:— అభీష్టావాప్తిరస్తు (కార్తవీర్యు నుద్దేశించి) వత్సా, యీ దర్భాసనమున నాసీనుఁడవు గమ్ము......(కార్తవీర్యుఁ డాసీనుఁ డగును. ఇంచుక దూరమున నా యూర్ధ్వజుఁడును గూర్చుండును)

మ॥ అవనీపాలకులాగ్రగణ్య! గురు దత్తాత్రేయదత్తప్రశ
స్తవరప్రాప్తమహాప్రభావుఁడవు - చంచద్బాహుశాఖా సహ
స్రవిలాసోగ్ర విపక్షకోటివని విభ్రాజిల్లు నీకీర్తి నా
చెవికిన్ వచ్చెను మున్నె - నేఁడు నిను వీక్షింపంగఁ గల్గెన్ జుమీ!

అహాహా! యహహా నీకుఁ గార్తవీర్య చక్రవర్తీ!

మ॥ నిరమిత్రంబయి నీదురాష్ట్రము సిరిన్
విలసిల్లునే? నీ ప్రజల్
చరియింత్రే యుపదిష్టులై శ్రుతిహితా
చారంబు? యజ్ఞంబులన్
ధరణీదేవు లొనర్తురే? వసుధ నా
నాసస్య సంపత్సుఖా
కరమై వెల్గునె? ధేను సంతతికి సౌ
ఖ్యంబే ధరావల్లభ!

కార్త:— త్రికాలవేదులు తమ రెఱుంగని దేమున్నది? మాకు సర్వమును సంపన్నమగుటకుఁ దమవంటి సంయమీశ్వరుల తపోమాహాత్మ్యమే కారణము కాని వేఱుకాదు.

జమ:— రాజమౌళీ! నీవును నీ మహామాత్రుఁడును వేఁట కతమునఁ గడు బడలియున్నారు. నా యాశ్రమమున మీరించుక విశ్రమించి మా యాతిథ్యము గ్రహింపవలయును.

కార్త:— మహా ప్రసాదము.

[మువ్వురును నిష్క్రమింతురు - తెర వ్రాలును.]

ప్రచండ భార్గవము

ద్వితీయాంకము - పంచమరంగము

[స్థలకము - జమదగ్నిమున్యాశ్రమోపాంతము - పరశురాముఁడు ధనుర్బాణతూణీరకుఠారధారియై ప్రవేశించును.]

పరశు:— ఇది మాయాశ్రమోపాంతముగదా, ఈ వనప్రాంతమంతయు నాకుఁ జిరపరిచితమయ్యు నేఁడెంతో నవీనముగా నదృష్టపూర్వముగా నున్నది.

సీ॥ దట్టంపుఁ బొదరిండ్లపట్టుల, మవ్వంపు
దివ్వెలోయనఁబొల్చు దీప్తమణులు -
మణులఁగ్రాని, కుసుమభ్రాంతి, మకరంద
రసకాంక్ష ఝుమ్మని ముసరుఁదేంట్లు -
తేంట్లుమొత్తమ్ములై తీవెలపైఁ గ్రమ్మ
నలరుగుత్తులనుండి యొలుకుఁదేనె -
తేనె బిందులు చింది తీరికాల్వలుగట్టి
సెలయేటి నీళ్లనలఁ గలియుచోట -

గీ। పళ్ళ-దరులందుఁ బచ్చికబీళ్ళ-నలువుఁ
గనులకు ముదంబు పచ్చరాగనులలీల,
నన్వహంబును దర్శనీయంబు ప్రకృతి -
యౌర, వనలక్ష్మి సౌభాగ్య మద్భుతంబు!

(పరిక్రమించి) ఏమి యాదృశ్యము! అల్లదే యాసింగపుఁ గొదమ సరస్తీరమున దప్పితీర్చుకొనుచున్న మత్తేభయూథముమీఁదికి దూఁకు

చున్నది. మెఱపుమెఱసిన ట్లింతలో నాగిరినది! ఓహో, పంచాననముం గాంచి కరిసంచయము పరుగెత్తిపోవుచున్నదే! శౌర్యములేని దేహబల మెంతయుండి యేమిప్రయోజనము?

ఐనను క్రూరసత్వములును మాతండ్రి తపఃప్రభావమున జాతివైర ముడిగి సౌహార్దమున నుండవలసిన యాశ్రమోపాంతముగదా యిది? ఏల యవి యిట్లు విరుద్ధాచరణమునకుం బాల్పడినవి? మాతండ్రి తపస్సు క్రోధాదులచే నేమైన నేఁడు కుంఠీభూతమైనదా? మా వేల్పుటావు తన ప్రభావము దిగనాడినదా యేమి? లేక విషయవ్యాసక్తుఁడగు నెవ్వనికేని రాకచే మాయాశ్రమము మలీమసమైనదా?

(రెండుమూఁడడుగులు నడచి) సూర్యభగవానుని కిరణప్రసారముచే నీకాసార మెంత రమణీయముగా నున్నది! ప్రతితరంగమునందును సూర్యప్రతిబింబమే! జీవులందఱును బరమేశ్వరుని ప్రతిబింబములే!...

[నిష్క్రమించును. తెరవ్రాలును]

ప్రచండ భార్గవము

(ద్వితీయాంకము - షష్ఠ రంగము)

[స్థలము - జమదగ్ని యాశ్రమ సమీపము. శూరసేన వీరవర్మలతోఁ గార్తవీర్యార్జునుఁడు ప్రవేశము.]

కార్త:—

సీ॥ షడ్రసోపేతమైన భోజనములెల్ల
వింతగా నొక్క క్షణములో సంతరించె,
ధేనువా యిది? నేనేల చెరిగి విమాలి
యష్టసిద్ధులకొలఁ యింత యిష్టపడితి!

మహాతపః పరిపాకమునఁగాక యిట్టి స్వర్గైచికి లభించునా! సర్వసంగపరిత్యాగులగు జడదారుల కిట్టి ధేనువు లెందుకు? శూరసేనా, మనము నేఁడనుభవించిన యాతిథ్య మీ గోమహిమవలనఁగదా! ఈ యావు మనకుండిన బాగుండును. ఐననిది యడవింగాచిన వెన్నెలయే యగు...... హోమాదికర్మానుష్ఠానమున కీమునికిఁ గావలసినన్ని ధేనువులం దోలిపెట్టింతము.

శూర:— అయిన మనతో దీనిఁ గొంపోవుదము.

వీర:— ఈముని మనపైఁ గినిసి శపించునేమో!

కార్త:— వీరవర్మా, యెంత వెఱ్ఱివాఁడవు. శాపములకుఁ బ్రతిశాపములు లేవా?

శూర:— ఈ మునితనయులలో నొకఁడు పరశురాముఁడను వాఁడు శివశిష్యుఁడట-లోకైకవీరుఁడట. క్రౌంచ పర్వతమున రంధ్రము గావించిన కృతహస్తుఁడట. కుమారస్వామి నోడించిన జయశీలుఁడట.

కార్త:— మేలు మేలు! అట్టి వీరశిఖామణితో నాకుఁ బోరాట మెప్పు డుప్పతిల్లునా, నాబాహువుల కండూతి యెన్నడు తీఱునా యని యెంతకాలమునుండియో కొండంతయాసతో వేచి యున్నాను. ఈ యావు మూలముననే నాకా వీరకుమారునితోఁ బోరు తారసిల్లిన నాకోరిక కొనసాగినట్లే!......

సరేకాని వీరవర్మా, సాంగోపాంగముగా ధనుర్వేదము సర్వము బ్రాహ్మణు లభ్యసింతురే గానీ, వారు పరాక్రమవంతు లగుదురా? శౌర్యము క్షత్రియులది. క్షాత్రగుణమునకు జన్మము కారణమగునుగాని అది యభ్యాస లభ్యమగునా? ఎంత భ్రాంతి పడితివి?

శా॥ భూమిన్ సన్నుత రక్షఁగాఁగలరు గో
వుంబట్టి కొంపోవ? సు
త్రామారామములోని కామగవి మా
త్రం బేను రమ్మన్న రా
దా మాహిష్మతికిన్? సురాసురులు తో
డైకూడి దండెత్తి నా
తో మార్కొందురు గాక. పోరితమునం
దున్నన్ను సాధింతురే!

వీర:— నిజము. నిస్సంశయము. ధేనువుం గొనివచ్చుటకు భటులకు నీయానతిం దెలియఁజేసి, పురమునకుఁ బయనముకండని చెప్పి వచ్చెదను ప్రభూ.

కార్త:— అట్లు కావింపుము (వీరవర్మ నిష్క్రమించును)

(శూరసేనునితో) సరసాన్నములు మధురపదార్థములు భుజించి నానావిధ పానీయములు త్రావి మత్తిల్లి మయూరధ్వజుఁడు నిద్రించుచుండునేమో. నీవేగి యాతని మేల్కొల్పుము.

శూర:— చిత్తము (శూరసేనుఁడు నిష్క్రమించును).

కార్త:— తప్పక గర్వం గొంపోవలయును. నాకుఁ బరశురాముని వలన భయమా! (అట్టహాస పూర్వకముగా) ముని తనయుని వలన గార్తవీర్య చక్రవర్తి కపాయమా ?

మ॥ జితవైరిక్షితినేతనై, విజయలక్ష్మీదేవికిన్ వీరభా
రతికిన్ హారతివట్టు నెవ్వఁ డా శూరవ్రాత కౌక్షేయమా
రుత సంధుక్షితమైన స్వీయసముదగ్రోగ్రాగ్నికీలావళిన్,
హుతభుక్తేజుఁ డతండు విప్రయువకక్రోధాగ్నిహవ్యాకృతిన్ మాయునే!

(నిష్క్రమించును - తెరవ్రాలును.)

ప్రచండ భార్గవము

ద్వితీయాంకము - సప్తమరంగము

[స్థలకము - జమదగ్న్యాశ్రమము - సాయుధముగాఁ బరశు రాముఁడు ప్రవేశము. ఆశ్రమ వృక్షములకు రుమణ్వత్సుషేణ వసు విశ్వావసులు బంధింపఁ బడియుందురు. రేణుక మూర్ఛిల్లి నేల వ్రాలి యుండును.]

పరశురాముఁడు:— (తల్లినిజూచి సమీపించి) ఏమిది, మాయమ్మ యేటి కిట్లు సొమ్మసిల్లినది ?...అమ్మా, అమ్మా, (నలుకెలంకులఁజూచి) మాయన్నలా ? అయ్యో, చెట్లకుం గట్టివేయఁబడిరా ? హా, ఘోరము! (సోద్వేగముగా నేగి వారి బంధములను విప్పును) అన్నా విశ్వావసూ, యీ మహాపరాధ మొనర్చిన దుర్జాతి యెవ్వరయ్యా? (తల్లి చేరువం జేరును) అమ్మా. (తట్టును) పలుకవేమి ?
(రేణుక కనులు తెఱచి లేచును, పరశురాముం జూచును.)

రేణుక:— నాయనా, వచ్చితివా ! ఎంతసేపైనది ?

పరశు:— ఇప్పుడే,...అమ్మా, నీవిట్లు మూర్ఛిల్లితివేల ? మాయన్నలను బంధించినదెవరు ?

రేణుక:— ......మన హోమధేనువును...

పరశు:— ఏమి తల్లీ. హోమధేనువేమైనది ? ఎవ్వరు కొంపోయిరి ?

రుమణ్వంతుఁడు:— ప్రభువొకఁడు మన యాశ్రమమున కేతెంచినాఁడు.

పరశు:— మన ధేనువును క్షత్రియుఁ డపహరించెనా ?

సుషేణుఁడు:— అతఁడును వాని యనుచరులును మన యావు ప్రసాదించిన భక్ష్య భోజ్యాదులను దనివిదీఱ నారగించినారు. పోవుచు మన యావుం దోలుకొనిపోయినారు.

వసువు:— తమ్ముఁడా, యీ యకార్యమును మేము నివారింపఁబోఁగా, వాని భటులు మమ్ముల నాశ్రమ వృక్షములకుం గట్టివైచిరి.

విశ్వా:వసు— ఆవున కడ్డముపోయిన మన యాశ్రమ మునీశ్వరులను వారు నేలఁ బడఁద్రోసిపోయిరి.

పరశు:— ఆహా... దుష్క్రమము.

రేణుక:— నాలవ శాలిహోత్రసమేతముగా స్వాహాకారమైపోయిన మీ నాయనగారు నన్నిందఱి యింకను దాఁటెరా. ఓరీ, (అశ్రువులతో) మన గోమాత, మాన లక్ష్మి, కన్నతల్లి యున్నట్లుగా నేఁడు పోయెను. పోలేక పోలేక, యాక్రమాకీడి వాపినది.

పరశు:— ఎంత ద్రోహము, ఎంత దౌర్జన్యము! ఆ నరాధముల కులపాంసనుఁ డెవ్వఁడు?

విశ్వావసువు:— కార్తవీర్యార్జునచక్రవర్తిగారు, మాహిష్మతి యుఁట వాని రాజధాని.

పరశు:— ఏమీ, కార్తవీర్యార్జునుఁడా, చక్రవర్తిగా! వీఁడా మా యావును దుచ్చులు రాక్షసులు స్వప్నమునందుగా? నేలఁ ద్రోయుటగా? మా యాశ్రమలను గాలికుం గట్టివేయుటగా? ఎంత యవమానము!......తల్లీ, యీ దారుణ పరాభవమునకుఁ బ్రతీకార మొనర్పలేని నా జన్మ మేటికి? నా నేత్రములఁ దో మెచ్చి బహూకరించిన యీ పరశు వేటికి? అన్నలారా, సెలవొసంగుఁడు అమ్మా, దీవింపుము (మోకరించును).

రేణుక:— ఆవు నెట్టులయిన మరలించుకొని రావోయి, చిరంజీవి,

మ॥ అనిలోనన్ వినతాతనూజుఁడు సహ
స్రాక్షున్ వినిర్జించి, తెం
పునఁ బీయూషముఁ దెచ్చినట్లు, గలు
షాత్మున్ గార్తవీర్యార్జునున్

దనుజాడంగల పోడిమిఁ మెఱసి, త్రో
క్రొ, నిండు సత్క్షత్త్రో
త్తమ గోవుం గొనిపోఁగఁ గోఁయు, భృగురా
మా, యుక్తాంగుండవై !

(కుమారుని గాఁగిలించి లేవనెత్తును)

పరశు:—(ప్రచండముగా) ఓరీ రాజాధమా, నేను క్షత్త్రియకుల కాళరాత్రినని యెఱుంగవా! కాలానలమును గాఁగిలింప గమకించితివా? ముక్కంటి మూఁడవ కన్ను ముద్దుపెట్టుకొన నెంచితివా?

స్రగ్ధర॥ గ్రావాళిన్ వజ్రధారన్
గ్రతుభుగధిపుఁ డుగ్రక్రియన్ ద్రుంచులీలన్
జేవన్ గొడ్డంటఁ ద్రుంతున్,
క్షితివడఁక, భవచ్ఛీర్షముల్ బాహుపాళిన్
గోవున్ రక్షింతుఁ బ్రీతిన్
గురుజనములకుం గూర్చెదన్ సంతసంబున్
భావిక్షోణీపతుల్ నా
భయమునఁ మునులన్ భక్తి సేవింత్రు గాతన్.

(పరశువు గిరగిరఁ ద్రిప్పుచు) ఇదే వచ్చుచున్నాను.

(నిష్క్రమించును - తెర వ్రాలును)

——

ప్రచండ భార్గవము

తృతీయాంకము - ప్రథమ రంగము

[స్థలకము - మాహిష్మతీనగర పరిసరోద్యానము - శిలావితర్దిపై నాసీనయై పూవులు దండగా గ్రుచ్చుచుఁ బాటపాడుచుఁ జంద్రరేఖ ప్రవేశము - పాట పూర్తికాఁగా వనపాలకుఁడు - ఆక్షేపకుఁడు ప్రవేశము]

ఆక్షేపకుఁడు:—అమ్మా, చంద్రరేఖమ్మగారూ, మయూరధ్వజులవారు దయచేయుచున్నారు.

[ఆక్షేపకుఁడు నిష్క్రమించును - చంద్రరేఖ లేచి యెదురేగి మయూరధ్వజుం దోడితెచ్చును. ఇరువురు నాసీనులగుదురు.]

చంద్రరేఖ:—చంద్రోదయ వేళకే వత్తునంటిరిగదా!

మయూర:—చంద్రరేఖ యీచాయ నుదయించి యెంతసేపైనది?

చంద్రరేఖ:—(చిఱునగవుతో) రెండు గడియలైనది. మఱి యేల ఆలసించితిరి?

మయూర:—చక్రవర్తిగారితో గోశాలకేగితిని. అచ్చట జాగైనది.

చంద్రరేఖ:—క్రొత్తయావు మేఁత మేయుచున్నదా?

మయూర:—మేఁతలో మూతి పెట్టుటలేదుగదా నీరు సైతము మానినది.

చంద్రరేఖ:—నేఁజూచినప్పుడు కన్నీరు గార్చుచుండినది. ఇప్పుడో?

మయూర:—ఇప్పుడు నట్లెయున్నది. ఆ యావుం గొనివచ్చుట న్యాయ్యమే. అందులకు శూరసేనాదుల ప్రోత్సాహమే ముఖ్య కారణము.

చంద్రరేఖ:—మహారాజ్ఞి మనోరమాదేవి కా యావుం గొనివచ్చుటే మాత్రమును నచ్చలేదు. ఆస్థానదైవజ్ఞులం బిలిపించి యాదేవి చాలసేపు మాటాడినది.

మయూర:—ఏమో, యెన్నిసంగతులో ?

చంద్రరేఖ:—ఎన్నోసంగతు లెక్కడివి ? ఒకటి రెండు మాత్రమే.

మయూర:—చెప్పవూ చంద్రరేఖా యవేవో ?

చంద్రరేఖ:—మొదటిది - హోమధేనువుంగూర్చి.

మయూర:—రెండవది ?

చంద్రరేఖ:— రెండవది రహస్యము. నేఁజెప్పరాదు....కంటిరా, యీ పూవులచందము. ఇవి యెంత సుందరములో యంత సురభిళములు (పూవులు మయూరధ్వజుని దోసిటం బోయును.)

మయూర:— (ఆఘ్రాణించి) అవును.

చంద్రరేఖ:— లోకమున సౌందర్య సౌరభ్యము లొక్కచోఁ గుదురుకొనియుండు టరుదుగదా !

మయూర:— అరుదంటవా ?

చంద్రరేఖ:— కాదా ? వెదకి వెదకి వేసారఁగా నిచ్చటనో వేయింటనొకట.

మయూర:— ఎచ్చోటికో పోవలయునా ?

చంద్రరేఖ:— ఏటికి ?

మయూర:— ఆనందకందమైన సౌందర్యముతో, సుమనోమనోహరమైన సౌరభ్యముగల యొక యపూర్వవస్తువు నాకిప్పు డిచ్చటనే లభింపలేదా ?

చంద్రరేఖ:— ఇచ్చటనా ?

మయూర:— అవును.

చంద్రరేఖ:— నిజమా ? పరిహాసమా ?

మయూర:— నీతోనా ?...నిరూపించినచో నేనడిగిన పారితోషకమిత్తువా ?

చంద్రరేఖ:— తప్పక.

మయూర:— సరే !...మఱచితిని, చంద్రరేఖా, మహారాజ్ఞిగారు దైవ

జ్యోతిష్కులతో మాటాడిన రెండవ విషయము 'అతిరహస్యము' - అని చెప్పక నన్ను గికురించితివే చెప్పవూ ?

చంద్రరేఖ:— ఇప్పటి మీకు లభించిన యపూర్వవస్తువేదో యెఱిఁగించినచో.

మయూర:— ఇదిమాత్రము రహస్యముకాదా ఏమి ?

చంద్రరేఖ:— ఇఁకనైన బాధింపక చెప్పఁగూడదా. మీ పుణ్యము.

మయూ:— ఎఱిఁగింతునా ?

చంద్రరేఖ:— ఊఁ.

మయూర:— నాకు దొరికినది - ఒక సుఖస్వప్నము.

చంద్రరేఖ:— (ఉత్కంఠతో) ఏదీ!

మయూర:— (చంద్రరేఖ నాలింగించి) ఇదిగో! (ఇరువురు నవ్వుకొని యానంద పరవశులగుదురు)

— రాణిగారు జ్యోతిష్కులతో మాటాడిన రహస్యమో ?

చంద్రరేఖ:— (మయూరధ్వజుని చెవిలో) మన వివాహమునకు మంచి ముహూర్తమేదో యను విషయము.

మయూర:— ఊఁ-హూఁ-అదియా ? మాటలలో మఱచితి నేఁడే నా పారితోషికము ?

చంద్రరేఖ:— కోరుకొనుఁడు.

మయూర:— ఒక్క మధురగీతి -

(చంద్రరేఖ పాడుచుండును - తెర వ్రాలును)

———

ప్రచండ భార్గవము

తృతీయాంకము - ద్వితీయ రంగము

[స్థలము - మాహిష్మతి - రాజాంతఃపురము - మనోరమ నిద్రించుచుండును - కార్తవీర్యార్జునుఁడు వ్యాకుల మనస్కుఁడు ప్రవేశము.]

కార్త:--- మనోరమా, మనోరమా,...నిద్రించినది. అర్ధరాత్ర మతిక్రమించినను నేఁడేల నాకు నిద్దుర రాకున్నది? ఏదో యాందోళన మొక్కటి నాహృదయమున నుదయించి నన్ను సంకటపెట్టుచున్నది. ఏమిటి, చిత్తమునకు విశ్రాంతి కుదురకున్నది? ఊహింపరాని యమంగళమును నామానసము శంకించుచున్నది - అమంగళమా? అర్జునున కమంగళమా?

సీ|| ఆహవక్షోణిలో బాహు సాహస్రంబు
ప్రకటించు భూరి పరాక్రమంబు
మేదురశక్తి నష్టాదశ ద్వీపముల్
పాలించు పటు సార్వభౌమపదము
దిగ్దంతి దంతకాంతిం బంతగించెడి
దాన ధర్మక్రియాధీన యశము
అమిత ప్రభావ దత్తాత్రేయ గురు కటా
క్షాసాదితం బణిమాది సిద్ధి

గీ|| కలవు నాయందు - లోక భీకరుఁడనైన
నాకు - దుర్వార మౌర్వీనినాదకలిత
చాపజీమూత సంజాత శరసమూహ
వర్షశమితారి వహ్నికి, భయముగలద?

మనో:— (నిదురలో) ఆ. ఆ. బ్రాహ్మణుఁడవు...గండ్రగొడ్డలి! ఏమొనర్తువు ?

కాన్త:— మనోరమా, మనోరమా, (సమీపించును) ఏమి, కలవరించుచున్నావా ? కల వచ్చినదా ? (తట్టును)

మనోరమ:— (దిగ్గన లేచి, నలుకెలంకులఁ జూచి, శోకముతో) కలగా, కలదు !

కాన్త:— ఏమి నీ భ్రాంతి ప్రేయసీ, కల వచ్చినదా ? భయపడితివా ?

మనో:— (చెమట తుడుచుకొని) నాథా, నాకొక పాడుకల వచ్చినది. ఒక బ్రాహ్మణ బ్రహ్మచారి, పరశుధారి, తన యావును మీరు గొంపోవుచున్నారని మిమ్ము వెంబడించి...తన గండ్రగొడ్డంటు... ఏమి వచింతును ? నా శరీరము...కంపించుచున్నది — నాకన్నులు గిర్రున తిరుగుచున్నవి...

కాన్త:— మనోరమా, ఏమి నీ భీరుత్వము ? ఏమి నీ వెర్రితనము ? ఎంత చేలవు! కలలో గాంచినవి కల్లలు గాక యథార్థములగునా ? మిణుఁగురుఁ బురువుఁ గని విస్ఫులింగములని విభ్రాంతి నొందినట్టు గదా యిది !

మనో:— దుస్స్వప్నము లమంగళ సూచకములు గావను మాట ? అది యటుండనిండు. మీరు ధేనువుం గొనివచ్చినప్పటినుండియు నా చిత్తమునకు శాంతి లేకున్నది.

కాన్త:— అవును. అదియే కారణము నీ కలకు. కలలన్నియు నిక్కము లన్నా ?

మనో:— పోనిండు నామాట మీ కేల వినరాదు ? సుపర్వసురభులఁ దృణీకరించు పయస్విని సహస్రములు గలవుగదా మనకు ! ఈ యావు మనకేటికి ? దీనిని సత్వరము మునీశ్వరు నాశ్రమమున కంపివేయుఁడు. జమదగ్నికుమారుఁడు మహా పరాక్రమశాలి యని విందుము. నాకుఁ గలలోఁ గన్పడిన వాఁడాతఁడే సుమా !

కాంత:— రమణీమణీ, అయినఁ గానిమ్ము. ఆ విప్రకుమారుఁడు రావణాసురునికన్న బలవత్తరుఁడా?

గీ॥ భూతనాథునగము పూబంతివలె నెత్తఁ
గలిగినట్టి పఙ్క్తికంఠుఁబట్టి
యల్లత్రాటఁ గట్టి యాఁకఁ ద్రోసినవాని
నోర్చువాఁడె విప్రయువకుఁ డొకఁడు?

మనో:— బలాబలము లటుండనిండు. మునుల ధేనువులఁ గొనివచ్చుట మనకుఁ దగనిపని సుమా!

ఉ॥ కంచెయె చేనుమేసిన జగమ్మున రక్షకులెవ్వరింక? శి
క్షించు నధర్మవర్తనుల - శిష్టపథమ్మునఁ బోవువారిఁ బో
షించు వసుంధరాధిపతి: చెప్పె సమ్మునిడాసి, గోవు న
ర్పించి తపోధనుండుఁ జనుగ నెంచుము మిమ్ములఁ బ్రాణ
నాయకా!

కాంత:— నీవింతటి రాజనీతి విశారద వెప్పుడైతివి మనోరమా,

[వృద్ధకంచుకి ప్రవేశము]

వృద్ధకంచుకి:— జయము జయము మహారాజులుంగారికి— కోట బహిర్ద్వారమునుండి చారుఁడొక్కఁడు విచ్చేసి, యంతఃపురము వెలుపల వేచియున్నాఁడు. దేవరవారి యానతికై నిరీక్షించుచున్నాఁడు

కాంత:— ఈ నడిరేయి చారులకు నాతో నేమిపని?

వృద్ధకంచుకి.— దేవరవారు క్షమింపవలయును. అత్యంతముఖ్య వృత్తాంతమఁట. దండనాయకుని కడనుండి వచ్చియున్నాఁడు.

కాంత:— అట్లయిన శీఘ్రమే ప్రవేశపెట్టుము.

[వృద్ధకంచుకి నిష్క్రమించును - చారుఁడు ప్రవేశించును.]

కాన్త:— ఏమి వార్త?

చారుఁడు:— సేనాని ఉగ్రసేనవర్మగారు దేవరవారికీ యుత్తరము పంపించినారు. (లేఖ నందించును.)

కాన్త:— (చదువును) -

"రణక్రియాకుశలుఁడు - పాశుధారి - మునికుమారుఁడు-
దుర్గరక్షకుల నాలుమందిని చించి చెండాడినాఁడు-
మన సైన్యము నుగ్గునూచే యగుచున్నది."

కాన్త:— ఏమి చిత్రము!... అశ్వశాలాధికారి కిప్పుడే ఇంద్రద్యుమ్నమును కట్టాయిత్తము గావింపుమని యిదే నా యాజ్ఞ.

చారుఁడు:— మహాప్రసాదము. (నిష్క్రమించును)

మనోరమ:— మునికుమారునితో సార్వభౌమునికి సంగ్రామమా?

కాన్త:— ....

మనోరమ:— కయ్యమైనను వియ్యమైనను సమానస్కంధులకు సంఘటిల్లినప్పుడే ...

కాన్త:— వలదు. మాటాడవలదు. (ఆగ్రహముతో)
మనోరమా, రాజకార్యములలో నీకీ ప్రాముఖ్యము వలదు.

మనో:— క్షమింపుఁడు. నేనేమంటిని? ప్రభువులకుఁ దపస్వులతో వైరములా యని యంటిని. ప్రాణేశ్వరా, నాపై-అలుకయా?

కాన్త:— ప్రియా, యిట్టియెడ నీపల్కులు తగవు.

మనో:— ఈనాఁడు నాహృదయము చేయిపెట్టి కలఁచినట్లున్నది. దయయుంచి నామాట వినుఁడు. ఈవేళ మీరు పోవలదు.

కాన్త:— నీవు వీరపత్నివిగావా మనోరమా? భీరువులదారి నడచుచున్నావు సుమా!

మనో:— నాయీప్రణయము నొప్పరికింతురా?

కాన్త:— (పెదమోము పెట్టును)

మనో:-- నా ప్రార్థనము నిరాకరింతురా ?

కార్త:—నీతత్త్వము నేనింక సైరింపను. (ఉద్వేగముతో) మానవా మనోరమా ? (పోఁబోవును)

మనో:—మన్నింపుఁడు. క్షణము సైపుండుఁడు.

[లోనికేగి కుంకుమ అక్షతలు కుసుమమాల పళ్ళెరమునం దెచ్చును]

ఆర్యాదేవి యార్యపుత్త్రునికి సంగరమున మంగళము లొసంగుఁగాక ! (ప్రియుని నుదుట కుంకుమబొట్టు పెట్టును)

మ॥ పగవానిన్ విగతాసుఁ జేసి విజయశ్రీన్ విజృంభించుచున్
మగసాటిన్ దగ నుల్లసద్హృదయముం బ్రాపించి వర్ధిల్ల, నా
వగచేర్పారఁగ వీరకోటి కొసఁగన్ నాప్రాణనాథుండు తేరఁగా,
నగవుల్ చిందఁగనచ్చుఁగా నిరుణానవ్యామృతాసారమున్

(సుమమాల పతికంఠసీమఁ గీలింపఁబోవఁ జేయిజారి నేలఁబడును)

ఆర్యా, యమంగళము... ప్రాణప్రియా, వలదు వలదు (నేలవ్రాలును)

కార్త:—అమంగళము నా వైరికి. మారణము నా విరోధికి. వీరుని కెప్పుడు విజయము. లేదా యప్పుడు స్వర్గము. తెలియదా నీకు ? (పరిక్రమించి)

స్రగ్ధర॥ వైరిన్ భంజింతు నేంతున్
ప్రకటిత భుజదర్ప ప్రభావం బెలర్పన్
ఘోరాజిన్ విక్రమింతున్
గొనకొని జయముం గొందు నానంద లీలన్
తోరంపుం బూలవానల్ .
దోలఁకఁగ, దివిషద్దుందుభుల్ మింట మ్రోయన్;
వీరస్తోత్రాళి మ్రోలన్
వెలయఁగలవారో విప్ర వంశాంకురంబుల్ ?

(నిష్క్రమించును- తెర వ్రాలును)

ప్రచండ భార్గవము

విష్కంభము

[స్థలము - జమదగ్న్యాశ్రమము - ప్రవేశము - జమదగ్నిముని శిష్యులు గాలవ శాలిహోత్రులు]

శాలి:— గాలవా, నేటి రాత్రియెల్ల, ఇంతేనా నీమనసుదిటవు? వనవాసులకు నానంతటి వ్యామోహము తగునా? ఒక్క పండైనఁ దిందువు లెమ్ము.

గాల:— వలదు, నన్ను బాధింపవలదు.

శాలి:— గుటికెఁడు నీరైనఁ ద్రావి మూఁడునాలుగు దినములైనది. శోష వచ్చును. నీ మొండిపట్టు విడువుము.

గాల:— హోమధేను వెచ్చోట నున్నదో? మేఁత మేయుచున్నదో లేదో? ఆరాజపాతకునింట నేమేమి యిడుములం బడుచున్నదో!

శాలి:— దానికేమియు భయములేదు.

గాల:— ఆదుర్మార్గుఁడు గోవును హరించిన నాఁటినుండియు నీయాశ్రమ పరిసర కురంగములు కన్నీరు నించుచుండుట చూచితివా? అదిగో యా తియ్యమామిడి గున్నవైపు చూడుము. పండ్లగుత్తులపైఁ గూరుచున్న చిలుకలు కైతము నోరు మెదల్పకున్నవి.

శాలి:— నిజమే. యీ యాశ్రమరూపమే మారిపోయినది.

గాల:— హా! కృతఘ్నుఁడు - కృతవీర్యునికొడుకు తన పాపఫలము ననుభవింపకపోవునా?

శాలి:— ఏమో వానియదృష్టమెట్లున్నదో?

గాల:— వంచకుఁడు, ద్రోహి! రాముని పరశుధారాహతి రుచిచూడఁ దలఁచి దొంగిలించినట్లున్నది. వానికిఁదగిన శాస్తి కాకమానదు. సందేహములేదు.

శాలి:— ఎట్లు కట్టువడినదో పాపము! తప్పక తప్పించుకొని యది యిచ్చటికి వచ్చునని నావిశ్వాసము.

('గాలవా, శాలిహోత్రా' అని నేపథ్యమున ధ్వని) గురువులవారు పిలుచుచున్నారు. పోవుదము రమ్ము. (ఇరువురు నిష్క్రమింతురు. తెర వ్రాలును)

ప్రచండ భార్గవము

తురీయాంకము-ప్రథమరంగము

[స్థలకము-మాహిష్మతి - అంతఃపురము-మనోరమా చంద్రరేఖలు ప్రవేశము]

చంద్రరేఖ:—(విసరుచు) పోఁబడిల్లును దేవీ, బ్రాహ్మణ బాలకులవలనఁ బ్రభువుల కపాయమా ?

మనోరమ:—చంద్రరేఖా, కాల మెల్లప్పుడు నొక్కరీతిగా నుండునని తలంతువా ? (దాసి ప్రవేశించును)

దాసి:—అమ్మా, మయూరధ్వజులవారు వచ్చి వేచియున్నారు.

మనోరమ:—వేగిరము ప్రవేశపెట్టుము.

(దాసి నిష్క్రమించును-మయూరధ్వజుఁడు ప్రవేశించును)

మయూర:—దేవిగారికిఁ బ్రణమిల్లుచున్నాను.

మనోరమ:—నీకు శుభమగుఁగాక. రణరంగమునుండి వచ్చితివిగదా, విశేషము లేమి ?

మయూర:—దేవీ, యాకర్ణింపుము. మహారాజులుంగారు యుద్ధరంగముం జేరునప్పటికి పరశురాముని తొలిప్రేటుకే శూరసేన వీరవర్మలు మరణించిరి. అవల సేనాని యుగ్రసేనుఁడు మొక్కవోని విక్రమముతోఁబోరాడి వైరి పరశుధారకెరయై వీరస్వర్గ మలంకరించెను.

మనోరమ:—(సోద్వేగముగా) ఉగ్రసేనుఁడా ? అయ్యో,

మయూర:—అవును. అతఁడే !

మనోరమ:—ఉగ్రసేనా, వీరాధివీరుఁడవు. ఉగ్రసంగరముల నెన్నింటనో, విరోధివాహినులం ద్రెళ్చివైచి, నానాదిశల విజయస్తంభముల నాటించినవాఁడవు. అపుడే నీప్రాయపుం బ్రొద్దుగ్రుంకినదా ? హా !

మయూర:—అంతట సేనాధిపత్యము సామాగ్రణియగు మణిగ్రీవుఁడు వహించెను. అతఁడు ప్రదర్శించిన శౌర్యచాతుర్యము దర్శనీయము దేవీ! జానుక్రిందట నొక విచిత్రము జరిగెను. మణిగ్రీవుని వింటినుండి శరమొక్కటి వెడలి, విలయానిలవేగముతోఁబోయి, పరశురాముని గండ్రగొడ్డలి నాకసమున కెగఁగొట్టెను.

మనోరమ:—మేలు! మణిగ్రీవా మేలు! వర్ధిల్లుము.

మయూర:—తరువాత, పరశురాముఁడు జీవన వినాశకారి శరముఁ బరశువు నొడిసితీసికొని, యురగముం దాఁకు గరుత్మంతునివలె మణిగ్రీవునిపై దూఁకి, యొక్కవ్రేటున ముక్కడంచినాఁడు.

మనోరమ:—హా మణిగ్రీవా, మణిగ్రీవా, నీకునురపాండితిఁ సంతసించితిఁ గదా!

మయూర:—అప్పటినుండి మహారాజే స్వయముగ సైన్యముల నడపుచున్నాఁడు. అలనాఁడు నర్మదానదియొడ్డునఁ జక్రవర్తికిని రావణాసురునికిని జరిగిన సమరము కన్నులఁ గట్టుచున్నది.

మనోరమ:—ఏమీ, నా బ్రాహ్మణబాలుఁ డంతటివాఁడా?

మయూర:—దేవీ, యాతఁడు దేవతాపురుషుఁడని తోఁచుచున్నది. ఎంతటి బలాఢ్యుఁడైనను వానిమ్రోల నసమర్థుఁడై పోవుచున్నాఁడు.

మనోరమ:—పోరుకలనికి నీవు మరలఁ బోయిరమ్ము.

మయూర:—పోవుచున్నాను. కాని మరలివచ్చుట కింక వలనుపడదేమో! అమ్మా, నన్నును సకలసన్నాహముతో రమ్మని సార్వభౌముఁడు వర్తమాన మంపినాఁడు. మూలబలముల నాయత్తము చేసికొని పోవుచున్నాను... అప్పటి విశేషములు మీకప్పటప్పటికి నివేదించుటకు మంజీరకుని నియమించితిని. సెలవా?

మనోరమ:—పోయిరమ్ము... చంద్రరేఖా, వీరిని గడపటి కక్ష్యాంతరము వఱకు సాగనంపి రమ్ము.

(మయూరధ్వజుఁడు చంద్రరేఖ నిష్క్రమింతురు-తెర వ్రాలును)

ప్రచండ భార్గవము

తురీయాంకము - ద్వితీయ రంగము

[స్థలకము - కాళికాలయము - ప్రవేశము మనోరమ]

మనోరమ:— అమ్మా, యీ నీ దాసురాలిపై నీ కరుణాకటాక్షము ప్రసరింపఁజేయవా ? నీవుగాక నాకు దిక్కెవ్వరు ?

శా॥ దేవీ, నీ వలనోక లోకములఁ బ్రీతిన్ సృష్టిగావించి, యా
పై వర్ధిల్లఁగఁ జూచి, తుట్టతుదిమాఁపం జేసి, మూర్తి త్రయ
శ్రీ వర్తిల్లెడు దివ్యశక్తివి సమర్చింతున్ నినున్ భక్తిమై.
ఈవే నన్నుఁ దరింపఁజేయవలెఁ దల్లీ, యీవిపన్నిరధిన్.

నీ యున్మేషమే జగత్సృష్టి, నీ నిమేషమే ప్రళయము - నన్ను బ్రోచుటకు భారమానీకు ?

మ॥ వ్రాసఁగల్ ప్రోచి, సమాదరించి జనని
బ్రతుల్ వత్సలత్వంబుతోఁ
బసివారిన్ బరితృప్తిచేయుదురు స
ర్వశ్రేయముల్ గూర్చి: నే
నసహాయన్-భువనైకమాతవగు నీ
యాలంబ నాసింతు-నా
పసుపుంగుంకుమ నిల్పఁబెట్టు మనుకం
పావృత్తిఁ గాత్యాయనీ !

(కర్పూరము వెలిఁగించి హారతి యీయఁబోవ జ్యోతి యారిపోవును. మనోరమ 'హా' యని మూర్ఛిల్లును.)

(చంద్రరేఖ ప్రవేశించును)

చంద్రరేఖ:— (మనోరమం జూచి నిర్విణ్ణయై) అమ్మో, దేవి యిట్లేల సొమ్మసిల్లినది. దేవి, దేవీ, (తట్టి), అయ్యయ్యో, (విసరుచు) ఏమొనర్తును?

[మనోరమ కనులు తెఱచును]

మనోరమ:— ఎంతసేపైనది చంద్రరేఖా నీవిచటకు వచ్చి?

చంద్రరేఖ:— ఇప్పుడేనమ్మా, నీ వేల యిట్లున్నావు?

మనోరమ:— ఏమని వచింతును చెలీ, ఈశ్వరుని నాపై దయతప్పినది.

చంద్రరేఖ:— ఏమైనది? ఎందుకు నీకీ యధైర్యము తల్లీ?

మనోరమ:— ఇంకేమున్నది చంద్రరేఖా, నాకు నీరాజనము వెల్గించి హారతి యీయబోవ...... జ్యోతి ఆరిపోయినది. (కన్నీరు నించును)

చంద్రరేఖ:— ఊఱడిల్లుము దేవీ, ఇంతేకదా?

మనోరమ:— ఆ సాధుకుల - పూలదండ నేలఁబడుట - ఈనాఁడే యుద రికునను!

చంద్రరేఖ:— ఈ యధైర్యము నీకుఁదగునా? అమ్మ, యథోచిత కవచాదులు ధరించి రణరంగమున కేగుదము. సుధాకర మహారాజుగారిం బ్రోద్బలదము.

మనోరమ:— ఉచితముగనే యుపదేశించితివి. నెచ్చెలివన్న నీవే. ఇట్టి సమయములఁగాక మన చిన్ననాఁటి ధనుర్విద్యా కౌశల మెప్పుడుపకరింపఁగలదు? రమ్ము పోవుదము.

(ఇరువురు నిష్క్రమింతురు. తెరవ్రాలును).

ప్రచండ భార్గవము

తురీయాంకము - తృతీయ రంగము

(స్థలకము - రణరంగము)

[ఆయుధపాణియగు కార్తవీర్యార్జునుడు ప్రవేశము]

కార్త:— (స్వగతము) ఘోరరణ విహారము - ఎంత కోలాహలము! ఎందఱు అశ్వికులు! ఎందఱు గజారూఢులు! ఇంత మహా సైన్యము నద్దెసలం గ్రమ్ముకొని యుద్ధ మొనరించుచున్నను సైర్యము వీడక పోరుచున్న యీ పరశురాముడు మానవమాత్రు డని తలచుట వెఱ్ఱి.

దిగ్విజయముం గావించినవాడను. దిశాపతులనెల్ల నోడించిన దశకంఠుని బందిగావించిన యశస్విని, ఈ మునికుమారునిచే బరిభవింప బడుచున్నాను. ఈతని ముందర నా సామర్థ్యము వ్యర్థమగుచున్నది. ఈ బుడుతని శౌర్యాగ్నిలోబడి నా సేనాధిపతులు బూడిదయైపోయిరిగదా! ఎంత విచిత్రము!

సూర్యాస్తమయముతో నేటికి యుద్ధము చాలింపబడినది. ఏదేని పన్నుగడ పన్నవలయు.

పరశురాముని కుడి పాదమున దీవ్రమైన గాయమయ్యెననుట నిశ్చయము. అంత గాయమైనను, రక్తము ప్రవాహమగుచున్నను, లేశమైన నాతని పరాక్రమము తక్కుబోయిన చిహ్నము కాన్పింపదు. ఏమద్భుతమిది?

నర్మదానది యొడ్డునగదా యీతడు రాత్రివేళల విశ్రమించుట! ఈ బాలు నెట్లైన వంచింపవలయు.

ఇతని బాహుబలము - సాహసము - ధనుర్విద్యాకౌశలము - పరస్పరము ప్రతి స్పర్థించుచున్నవి. ఈ యన్నింటికన్న మిన్నయైన యితని

బ్రహ్మచర్యప్రభావమే కాని సృష్టియని జేయుచున్నదని తోఁచుచున్నది....

ఇంద్రియజేత! మీరు మహర్షి పరమశివుని ప్రియశిష్యుఁడు! బ్రహ్మచర్యమా? (వికటాట్టహాసముతో) పరాశరునివంటి మునీశ్వరుల పాషాణ హృదయములను బాలికతుఁడు కనతెప్పపాటులో నీరు గావింపలేదా? ఇట్టి పసిబాలకుల చిత్తములను మెత్తచేయలేదా? చూచెదఁగాక! ఎట్లు తప్పించుకొనఁగలుగునో?

ఇప్పుడు గాకున్న నా యణిమాదిసిద్ధుల ప్రయోజన మింకెప్పుడు? (కన్నులుమూసి తెఱచి, శిరఃకంపన మాచరించి) సంకల్పితాకారము ప్రత్యక్షమగుఁగాక!

[భువనమోహిని యవతరించును - నమస్కరించును]

భువనమోహిని:— స్వామీ, యేమి యాజ్ఞ!

కార్త:— నర్మదా నదియొడ్డునఁ బరశురాముఁ డీసుక తిన్నెలపై విశ్రమించి యున్నాఁడు. పోయి యుక్తమైన వంచించి యా బ్రహ్మచారిని నీయుచ్చులలోఁ దగిలించుకొనవలయు. వింటివా?

భువనమోహిని:— మీయాజ్ఞ నాదలం దాల్చితిని.

కార్త:— ఓడిపోయితివా?

భువన:— దేవర యాజ్ఞ.

కార్త:— పొమ్ము - నీ సామర్థ్యము సర్వము వినియోగింపుము. జాగ్రత్త సుమా!

[భువనమోహిని మోఁకరించి లేచి సెలవుఁ గైకొని వెడలును.]

కార్త:— ఈ వ్యూహము నెట్లు భేదింపఁగలఁడో చూచెదఁగాక!

(నిష్క్రమించును - తెర వ్రాలును).

ప్రచండ భార్గవము

తురీయాంకము - చతుర్థరంగము

స్థలకము - నర్మదానదీతీర సైకత స్థలము

[సొమ్మసిల్లి పడియున్న పరశురాముఁడు ప్రవేశము.]

(భువనమోహిని మెలఁకువతో మెల్లమెల్లఁగాఁ బరశురాముని సమీపించి, యతని గాయమునుండి స్రవించు నెత్తురు తుడిచివైచి, తాఁదెచ్చిన యౌషధము గాయమునకుఁ బొందుపఱచి, కట్టుగట్టి, పర్యంకములో నిరీక్షించుచుండును. పరశురాముఁడు పెదవులను నాలుకతోఁ దడపుకొనుచుండుట చూచి భువనమోహిని నదీజలము దోసిటఁ గొని వచ్చి, నోటికందించి యాతని దప్పితీర్చును. పరశురాముఁడు కన్నులు తెఱచి చూచి విస్మితుఁడగును.)

పరశు:—ఎవ్వతె యీమె? జగన్మోహనాకారముం దాల్చిన యీ సైకత స్త్రీమోహిని యెందుండి వచ్చెనో? భగవానుఁడగు నీశానుని వంచింప శ్రీమహావిష్ణువు మోహిని యనుపేర నప్సరాకారముం దాల్చెనని చెప్పుదురు. ఆమె యిట్టిదేనా?

అమ్మా, నీ వెవ్వరవు? నన్నుద్ధరింప నేతెంచిన దాక్షాయణివా? సప్తమాతృకలలో నొక్కతెవగు నీవీ రూపమున నా గురువు నానతిచే నా బాధఁ దొలఁగింప నేతెంచితివా?

భువన:—ఇంచుక తగ్గినదా నీ గాయపుబాధ?

పరశు:—ఇంచుక తగ్గుటయేమి? సంపూర్ణముగ శమించినది.

భువన:—ఆయాస మెట్లున్నది?

పరశు:—నా శరీరమునకు నవ్యసత్త్వము లభించినది.—ఎన్నఁడు నన్నెఱుంగనిదానవు నీకేటికో నాపై నిట్టి యకారణ వాత్సల్యము? నీ ఋణము నే నెట్లు తీర్చుకొనఁగలను?

భువన:—మునికుమారా, నీవు నాకొక్క సాయము చేయవలయు.

పరశు:—అమ్మా, కార్తవీర్యునితోఁ బొసంగిన యుద్ధము విడిచిపెట్టుట తప్ప-మఱేకార్యమయినను గావించుటకు సంసిద్ధుఁడను. మహోపకారము సల్పిన నాభాగ్యదేవతవు. నీ కెవ్వరైన శత్రువులున్నారా? వారలను నిర్మూలింపవలయునా తల్లీ! నా గురుండగు ధూర్జటి, గురుకుమారుఁడగు కుమారస్వామి, వీరిరువురు గాక నీకపకారము నర్చిన వారెవ్వరైన, వారిఁ జెండించి కసిదీఱ నీయుప నులఁ గావించెద-నీకు సంతసముం గూర్చెద, తల్లీ నీవెవ్వరవు?

భువన:—నేనొక దేవతా వనితను. అంబర విహార సమయమున వినోదమునకీ నదీతీరమునం దిరుగఁ దలచి రాఁగ మూర్ఛిల్లియున్న నిన్నుం గని, జాలిగొని నీకీపరిచర్య గావించితి. కుమారశరీరమునఁగల నీకీఖడ్గక్షతి యేల కలిగెను?

పరశు:—కార్తవీర్య చక్రవర్తికిని నాకును సంగరము పొసంగినదని మున్నే వచించితినిగదా, ఆ యుద్ధమున నాకీగాయము తగిలినది.

భువన:—ఎల్లప్రాయము - కుసుమకోమలమగు దేహము - చక్రవర్తితో సమరము-బాగుబాగు, నీతలిదండ్రు లిందులకు సమ్మతించిరా?

పరశు:—మా హోమధేనువును దొంగిలించిన సహస్రబాహుని గర్వనిర్వాపణము మాతలిదండ్రులకేల సమ్మతముకాదు? వారి సమ్మదము గలిగించుటకే నా యీ సమరసంరంభము.

భువన:—బలవంతులతో బాలురకు - బాపలకు వైరములు తగునా?

కం॥ జననీజనకుల యాజ్ఞన్
గొనకే, పసివాఁడ వీవు, కుటిలారిపయిన్
జెని, యని యొనరించెదవా?
మునితనయుల కిట్టి కార్యములు మేలగునే?

పరశు:—వైరిని జయింపఁజాలనని నాకొంతయేని సందియము లేదు.

భువన:—సరియే, అరాతి నిర్యాతనము కావలయుఁగదా! నీ చిత్తమునకు నూతనోత్సాహము చేకూర్తును. కర్ణరసాయనముగ గాన మొనరించెద నాకర్ణింపుము.—

(పాటపాడుచు నృత్యమొనర్చును)

మునికుమారా, మేము దేవతాస్త్రీలము-మాకు సంగీత సాహిత్యములు వెన్నతోఁబెట్టిన విద్యలు. నాట్యకళ మాసొమ్ము. ఏమందువు? పలుకవేమి? (సమీపించును). సంగీతమన్న వైరస్యమా నీకు? గాంధర్వ వేదమగా య్యిది!

(చిఱునగవుతో) మునికుమారా, నాకొకమాటయిచ్చియున్నావు మఱచితివా, యేమి? నీ వాగ్దానమును బరిపాలింతువుగదా.

పరశు:—నిస్సందేహముగా నెఱవేర్తును.

భువన:—వచియింతు, వినుము.

మ॥ చివురుంగైదువు జోదునాపయునిదాక్షిణ్యంబు లేశంబులే
కవినీతిం గఱకైన పూములుకు లేయంజొచ్చె దర్పించి, వ
చ్చి విపన్నన్ శరణంటిఁ, గాచి, భవదాశ్లేషంబునాకిచ్చి, శా
త్రవ నిర్యాతనముం బొనర్పు, మునిపుత్రా! వీరచూడామణీ!

పరశు:—(విభ్రాంతుఁడై) నీవాక్కులు విస్మయము గొల్పుచున్నవి.

మ॥ తగునేయిట్టి యవాచ్యభాషణములో తల్లీ, ననుం గూర్మిప
ట్టిగ భావింపుము: కూడదీ కుటిలపాండిత్యంబు నామ్రోలఁజూ
పఁగ, ధర్మక్రియలన్ వరించి నియతిన్ వర్తించుమాంబోట్ల నీ
చగతిన్ ద్రోసెడి మాటలాడకు, నమస్కారంబుగావించెదన్.

భువన:—మంచివాఁడవు- మేలు మేలు-మునికుమారుల సత్యవాక్సంపత్తి యిట్టిదేనా యేమి? మాటతప్పుట మీ మర్యాద గా?

పరాశ:—ఇట్టి గురుద్రోహము నీ మానసమున దాఁచి యుంచుకొని మోసగింతువని తలంపలేను. ఎంత మోసము!

ఔరా, దేవతాసుందరివి, మునిపుత్రుని మోహింపఁ దగవా?

భువన:—వాగ్దానము వమ్ముగావించి వాదమునకు దిగితివా?

పరాశ:—(స్వగతము) ఏమాశ్చర్యము? మాయలమారి కార్తవీర్యుఁడే యీ సంవిధానము ఘటించియుండునా?......సందేహము లేదు. (ప్రకాశము) ఓవనితా, నీవెవ్వతెవైన నాకేమి? నా చిత్త విశ్రాంతికి భంగము గావించితివి. నీ విచ్చోట నిలువరాదు - పొమ్ము...పోవా?

భువన:—పోనిచో! ఏ మొనర్తువు? (నవ్వుచు) స్త్రీహత్యాపాతకమునకుఁ బాల్పడుదువా?

పరాశ:—నేఁ జేయనెంచినదేమో, యది యుండని, పొమ్మావలకు.

భువన:—వెడలిపోవలయునా? పోయెదను, పోవుచున్నాను.

ఉ॥ ఆడినమాట తప్పిన మహాఘము-గాయము మాన్పినట్టి పూఁ
బోఁడిని దూలనాడి, నయముం విడనాడి, కృతఘ్నవృత్తితోఁ
గీడొనరింపఁ బాల్పడిన కిల్బిషముం నినువీడిపోవదో
బాడబ, తత్ఫలంబుగఁ బ్రవర్తిలు ముక్తిని బ్రహ్మచారివై!

పరాశ:—(ఆగ్రహముతో) నీ దృష్టికి నేనట్టివాఁడనే యగుదునుగాక. నీ శాపము నాకు వరమేయైనది. ఏమంటివి? నేను కృతఘ్నుఁడనా? పడఁతీ, చూడుము నావంక! కృతఘ్నతయా? (తేరి పారఁజూచెను.)

భువన:—ఆహా, అద్భుతము! అమానుష తేజము! దుర్నిరీక్ష్యము,... బ్రహ్మతేజో బలము - చూడఁజాల-చూడఁజాల!

(నిష్క్రమించును)

పరశు:—అబ్బ! పరమేశ్వరుని యనుగ్రహమున బ్రతికి బైటపడితిని.... అపుడే యరుణోదయమైనది.

మ॥ ఉడుసంఘోపహము లోపాటిల్లెఁ, గమల
వ్యూహంబు కాంతిల్లెఁ బు
ష్పాళి రేఁగెన్ విమలప్రభాత పవనం
బుల్ సాగుటన్-గల్వపూఁ
బడఁతుల్ మోము ముడించి రెల్లెడల-ది
గ్భాగముల్ ప్రసన్నాస్యలై
కనుగారామున లోకబాంధవుని రా
కన్ గోరుచున్నారిటన్.

యుద్ధమునకు సంసిద్ధుఁడను గావలయుఁగదా, కాల్యకరణీయముల నిర్వర్తింపఁబోయెద.

(ప్రవేశము కుమారస్వామి)

పరశు:—ఎవరు, నా ప్రాణసఖుఁడు షణ్ముఖుఁడా? - నా దృష్టి నన్ను మోసగించుచున్నదా యేమి? ... ఏమి నాభాగ్యము! ఎంత యదృష్టము!

కుమార:—పరశురామా, మాతండ్రిగారివలన నీ వృత్తాంతము విన్నాఁడను. నినుఁజూడవచ్చితిని, మెచ్చితిని. నీ మహిమ నేనెఱుఁగనిదికాదు. (కౌఁగిలించుకొనును)

పరశు:—మిత్త్రవాత్సల్యమున నీవిట్లనుచున్నావు.

కుమార:—ఇన్నేకము లావాడనా నేను? ఈనిందు పున్నమ పండు వెన్నెలలో నాకన్నులతో నేను స్పష్టముగా జూచితినయ్యా, కాల్పనికుఁడు ప్రయోగించిన సమ్మోహనాస్త్రము నీ పట్ల భంగమగుట నేను గ్రహింపలేదనుకొంటివా? గ్రహింపుము నా నమోహారులు.

సీ. మోహాసియుండవు మేల్మేల్, పరిశుద్ధ
సత్వ, ధీమాసంగ్రామ ఘో
ర్యాహనోద్ధృతా, స్వాదీయమైన సుపవి
త్ర బ్రహ్మచర్యంబె, యు
గ్మస్త్రహా నిక్కము యుద్ధభావమును సం
పాదించెఁ, దౌర్దస్త్రహా
మహిం నాశ్రయింప నేవంబు మీరు జెడిరం
పణ ప్రకాశించుఁ సఖా!

...పోయివత్తును. సెలవా?

పరశ:—జగద్గురువులకుఁ బార్వతీపరమేశ్వరులకు నా ప్రణామము లర్పింపుము.

(ఇరువురు నిష్క్రమింతురు - తెరవ్రాలును).

ప్రచండ భార్గవము

పంచమాంకము-ప్రథమరంగము

[స్థలకము - మాహిష్మతీ నగరపరిసర రణరంగము - ప్రవేశము - ఖడ్గహస్తుఁడగు కార్తవీర్యార్జునుఁడు.]

కార్త:— సందేహములేదు. అవతారపురుషుఁడే! నన్ను సంహరించుటకు భగవంతుఁ డిట్లవతరించినాఁడు. ఇంత విక్రమవిభూతి మనుష్యమాత్రుల కుండుట కల్ల. ఇట్టి జితేంద్రియులు జగత్తునలేరు. పట్టమహిషీవిహితోక్తులు పాటింపక పోతినిగదా, పెడచెవిం బెట్టితినిగదా! మూర్ఖుఁడను - దైవోపహతుఁడను.

శ్రీమహావిష్ణువు పరశురాముఁడై నన్ను శిక్షింపవచ్చినాఁడు. ఇప్పుడు వెనుకంజవేయుటయా? నాకు మరణభయమా? ఛీ, ఛీ! ఇది నా యదృష్టమే! మహాభాగ్యమే. ఆ భగవంతుని దివ్యతేజస్సులో లీనమైపోయెదఁగాక!

మ॥ గెలువన్ నేరనుగాని, నా సమరభం
గిన్ జూచి భర్గుండె బె
గ్గిలఁగా వీరవిహారపారగుఁడనై
క్రీడించెదన్, నాదు కో
ర్కులు నిండారఁ బ్రచండభార్గవసము
ద్రేకప్రతాపార్కమం
డలమార్గంబున నిర్గమించెద, వికుం
ఠద్వారమున్ జేరెదన్!

(సరభసముగా నిష్క్రమించును - తెర వ్రాలును)

12 / 1065A

ప్రచండ భార్గవము

పంచమాంకము - ద్వితీయ రంగము

[స్థలకము - రణరంగము. వీరపురుష వేషములతో సాయుధలగు మనోరమా చంద్రరేఖలు ప్రవేశము.]

చంద్రరేఖ:—అమ్మా,

మనో:—(రహస్యముగా) 'అమ్మా' యనకుము.

చంద్ర:—రమాకాంతా, చూచితివా? మనసైన్యమెంత వశించినదో, త్రిపుర సంహారమొనర్చు మృత్యుంజయుఁడా యేమి యీ పరశు రాముఁడు?

మనో:—అటు చూడుము కనబడుచున్నదా? అదిగో అటు!

చంద్ర:—రాజమార్తాండుని వీరవిహారము గదా, కానవచ్చుచున్నది. అద్భుతముగానున్నది. ...ఆ, ఆ, భటులారా, వలదు పరుగెత్త వలదు.

మనో:—రమ్ము రమ్ము - అవ్వైపున కేగుదము. భటుల కుత్సాహము గల్పింతము.

(నిష్క్రమింతురు)

(వేఱొక దిశనుండి యిరువురును పునఃప్రవేశము)

మనోరమ:—పోరుఁడు, ధైర్యము వీడకుఁడు.

కం॥ గెలిచినచోఁ గీర్తిరమా
కిలికించితముల్ లభించు, గెలువక పోరన్
బొలిసినచోఁ, ముక్తిసతీ
లలిత పరీరంభ దివ్యలాభం బొదవున్!

పనుకంజే చేయుచున్నారా ? వలదు వలదు.

కం॥ మీాకండలు పెరిఁగెను భూ
మీాకాంతుని కొలువునందె, మెయిపయినాసక్
గైకొని యరమర పోరునఁ
బోకార్పకుఁడయ్యె కీ ర్తి పోటరులారా!

నడువుఁడు. విజృంభింపుఁడు....

చెలికాఁడా, నీ వీవంక కేగి రమ్ము. నే నా కోటకొమ్మునకుఁ బోయివచ్చెద.

(నిష్క్రమింతురు - తెర వ్రాలును)

ప్రచండ భార్గవము

పంచమాంకము - తృతీయరంగము

[స్థలకము - రణరంగమున నొక ప్రదేశము - త్వరిత గమన ముతో నెడమకంటికడఁ దగిలిన గాయమునుండి వచ్చు రక్తము నొక హస్తముతో నాపుచు యోధరూపమునున్న మనోరమ దుముకును.]

మనో:—అబ్బ,...ఈ, దెబ్బ నాకెట్లు తగిలెను? శర మేవైపునుండి వచ్చెను? ఎంత నిరోధించినను రక్తము నిలువదేమి? (తనయంగీ చించి గాయమునకుఁ గట్టుకట్టును. ఒడలెల్లెడఁ బరామర్శించు కొనును) - తాపము! దాహము! (నేల వ్రాలును.)

(ప్రవేశము చంద్రరేఖ.)

చంద్ర:—(ఆవేగముతో) అయ్యయ్యో, (కట్టు సవరించి) ఏమిది?

(మనోరమ కన్నులు తెఱచును.)

మనో:—వచ్చితివా, యుద్ధ మెట్లున్నది?

చంద్ర:—చక్రవర్తికిని బరశురామునికిని ద్వంద్వయుద్ధము జరుగు చున్నది.

మనో:—ఔరా, ప్రభు వేకాకిరై పోరుచున్నాఁడా?...కొంత్రకవచ మొకటి తేఁగలవా?

చంద్ర:—తప్పక. ఇదే పోయి తెచ్చెద...

[ఇరువురు నిష్క్రమింతురు - తెర వ్రాలును.]

ప్రచండ భార్గవము

పంచమాంకము - తురీయ రంగము

[స్థలకము - రణరంగమున మఱియొక ప్రదేశము - కార్తవీర్యుని శరీరము విగతశీర్షమై పడియుండును. ప్రవేశము మనోరమ.]

మనోరమ:—(నలుకెలంకులఁ జూచి) మహాభయంకరమై యున్న దీ సంగ్రామ భూమి. బీభత్సరసాధిదేవత కిట్టి ప్రదేశములే కాఁబోలు విహారరంగములు !

చూర్ణములైన కవచములు, విధ్వస్తములైన రథపంక్తులు, భగ్నములైన తురంగసంఘములు. అహా! యెంత వినాశము, ఎంత రక్తపాతము ? ఎందుకోయిది ?

ఈ వైపునఁ గదా చక్రవర్తికిని భార్గవునికిని ద్వంద్వయుద్ధము జరుగుచున్నదని వింటిని. ఈ ప్రదేశము నిర్జనమైయున్నదే ! (రెండడుగులువైచి) అయ్యో, ఎవ్వరిదీ శరీరము? (సమీపించి, చూచి, పరిశీలించి, స్పృశించి) హా! (మూర్ఛిల్లును).

(మూర్ఛనుండి తేఱి) అయ్యో! వలదన్న వినకపోయితిరి గదా, ఆ మాయలమారి యావు మీపాలిటి మృత్యుదేవత యయ్యెనా ?...... దత్తాత్రేయమహర్షీ, నీ వరము లమోఘములని యువ్విళ్లూరితిమే !... అణిమాదిసిద్ధులారా, మీరైన బ్రతికించుకొనలేక పోయితిరా ప్రభువును? ...జమదగ్నీ, విప్రుఁడవుగదా నీ కిట్టి కుమారుఁ డేల జన్మించెనయ్యా ? రేణుకా, నిట్టనిలువున నీ తనయునిచేత నా మనోహరుని వధింపఁ జేసితివా? పతిప్రాణనగు నేను నా పతి ప్రాణములకై యెట్లు పలవరించుచున్నానో యట్లే నీవును నీ జీవితేశ్వరుని జీవములకై యొక సారికాదు గదా ముయ్యేడుమార్లు వాపోవుదువు లెమ్ము. నావిభుని మస్తకము నీకొడుకెట్లు ఖండించెనో, యట్లే నీ శిరమును, నీ బిడ్డల శిరంబులును నిర్దయుఁడై యతఁడు తెగవేయునుగాక!......అహా, యేమి యీ తాపము, ఏమి యీ గాయపు బాధ, దుర్భరము, ప్రాణేశ్వరా, నీ సన్నిధానమున కిదే వచ్చుచున్నాను. అమ్మా, కాత్యాయనీ,...(పడిపోవును - తెరవ్రాలును).

ప్రచండ భార్గవము

పంచమాంకము - పంచమ రంగము

[స్థలము - అరణ్యము - హోమధేనువును నడిపించుకొనుచుఁ బరశురాముఁడు ప్రవేశము.]

పరశురాముఁడు:—అతనిం గడతేర్చి, దీనిం గొని వచ్చుటకై యెంత ప్రయాసపడవలసి వచ్చెను?

(ఆవు నుద్దేశించి) అమ్మా, గోదేవతా, ఎంత పరితపించితివో యేమో! నరక నిలయములగు నరేంద్రుల మందిరాంగణముల మనవలసిన దుర్గతి చేకుఱెనని దురపిల్లితివా? శర్వునికడ నే నలవఱుచుకొన్న సంగ్రామ కౌశలమెల్ల శ్మశానము పాలై పోయెఁ గాఁబోలునని నిరాశ చేసికొంటివా? హోమాది నిత్యకర్మానుష్ఠానమునకు వలసిన ద్రవ్యసంపత్తి సంకల్పమాత్రమున సమకూర్పఁగలిగిన నిన్ను రక్షించుకొననేరని బైరాగులతో సంగాతి మీ గతికిఁ దెచ్చెఁగదా యని యంగలార్చితివా? గోరక్షణ మొనర్చుకొనలేని యంబేద లాచరించు జపతపో వ్యాసంగములు భస్మహవ్యము లగునని శపించితివా?

హీనమానవుల బారినుండి ధేనువులఁ దప్పింపలేని దీనులకు స్వారాజ్య సంసిద్ధి యెక్కడిది? పాతకుల వాతనుండి గోవుల రక్షింపఁ బ్రాణముల నొడ్డి, వెచ్చని నెత్తురులు ప్రవాహములుగాఁ బాఱించుటకైన సంసిద్ధము కావలసిన భారతజాతి యేనాఁడు వెనుకంజవేయునో, యేనాఁడు తూష్ణీంభావము వహించునో యానాఁడే యయ్యది సంక్షయము నొందునుగాక!

మ॥ నుతికెక్కెన్ భరతోర్వి నీవలన, నిన్నుం బూజగావించుచోటన్
బ్రతుకంగల్గెను శ్రౌతధర్మములిటన్: వర్ధిల్లుమో తల్లి, భా
రతభాగ్యావహకల్పవల్లి, పరమార్థ ప్రాపకంబైన మా
మతమే తాలిచెఁ దావకాకృతి జగన్మాతా, నమోవాకముల్!

ఉ॥ నా తరమే నుతింప నిపుణమ్ముగ నీగుణముల్! పయోధరీ
భూతచతుస్సముద్రవు-విభూతివిశిష్టవు-ధేనురూపధా
త్రీతరుణీమతల్లి, యొనరించెద నీకుఁ బ్రదక్షిణంబు: నా
పాతకముల్ శమించుత దివాకరదీప్తిఁ దమమ్ములుంబలెన్.

మ॥ సతముం గోవులఁ గొల్చుచున్ సురభిహిం
సాపాతకారంభులన్
హతమార్పన్ వ్రతదీక్ష గైకొనిన, హిం
ద్వార్యాఘ మద్దాన శా
శ్వతసంపూజ్యత గాంచుతన్! సకల శో
భాలాభ గేహమ్ము భా
రతవర్షమ్ము సమస్త దేశమకుట
ప్రాయమ్ముగుం గావుతన్!

ఔరా, యీ కార్తవీర్యుఁ డెంత పరాక్రమశాలి! ఎంత విక్రమ ధురంధరులైనను జక్రవర్తులు, నిరపరాధులగు సాధువులను, బ్రపంచానుషంగ మొల్లని మునిజనులను గాతించుటేమి న్యాయ్యము? దురహంకారుల కిట్టి శాస్తి కావలసినదే.

గీ: సాధుసంయమి గోవిప్ర సమితియెడలఁ
బుడమిఁ జేసేత కావింపఁబడినకీడు
కర్తను హరింపగల్గుటే కాదు సుమ్ము,
సల్పు తప్పక వాని వంశక్షయమ్ము!

ఈ మా యావును గొంపోయి నా జననీజనకులకును సోదరులకును సమ్మోదముం గూర్చెదఁ గాక!

(నిష్క్రమించును - తెరవ్రాలును)

ప్రచండ భార్గవము

పంచమాంకము - షష్ఠ రంగము

[స్థలము - జమదగ్ని యాశ్రమము - ప్రవేశము జమదగ్ని.]

జమదగ్ని:—అల్లదే యరుణరేఖలు!

చ॥ వికచసరోజగర్భములు వెల్వడి బంభరముల్ పొనర్చు గీ
తికల కలస్వనంబది శ్రుతిస్వరవైఖరి నింపొనర్చ, న
వ్యకుసుమసారసౌరభసమన్విత మంథరగంధవాహముల్
ప్రకృతినిమేలుకొల్పఁగఁ బ్రభాతముతోఁచెమనోహరాకృతిన్

స్నానార్థమై నది కేగదఁగాక,......రేణుక నేఁటేల యింకను నిదురించుచున్నది?...(పరిక్రమించి) రేణుకా, ఏమి నీ వింకను నిదురించుచున్నావు?...(పరిశీలించి) నిదురించుట లేదు. ఏమిది? వెక్కి-వెక్కి యేడ్చుచున్నావు రేణుకా?

రేణుక (గాద్గద్యముతో) ఒంటరిగాఁ బోయిన మన రాముఁడు...

జమదగ్ని:—ఓహో, యిదియా నీ విచారము? లెమ్ము, లెమ్ము.

శా॥ ధానుష్కాగ్రసరుండు విక్రమకళాదక్షుండు త్రైలోక్యర
క్షానిర్నిద్ర భుజార్గళుండు నిటలాక్ష ప్రాప్త దివ్యాస్త్రవి
ద్యానిష్ణాతుఁడతంద్రిలుండు నిరవద్యబ్రహ్మతేజోఘనుం
డా నీరామునకా భయంపడెద వేలా బేలవై యీఁగతిన్?

(శిష్యుఁడు గాలవుఁడు ప్రవేశించును)

గాలవుఁడు:—గురుదేవా, మన పరశురాముఁడు హోమధేనువుతో వచ్చుచున్నాఁడు. రేణుక (ఉత్సుకయై) పరశురాముఁడా, యేఁడీ,

యేఁడీ, ఎంత దూరమున నున్నాఁడు? నిజమా, గాలవా, నాయనా? ఎవరు చెప్పిరి?

గాలవుఁడు:— నేఁ జూచితినమ్మా, అదే, వచ్చుచున్నాఁడు.

[పరశురాముఁడు ధేనువుతోఁ బ్రవేశించును. వెంట రుమణ్వత్సుషేణ వసు విశ్వావసు శాలిహోత్రులు ప్రవేశింతురు - రేణుక పరశురాముని ఆనందాశ్రువులతో గాఢాలింగన మొనర్చుకొనును-పరశురాముఁడు తలిదండ్రులకు సాష్టాంగ నమస్కార మాచరించును.]

జమదగ్ని:— నా ప్రాణతుల్యమైన యీ హోమధేనువుం గొని మరలి వచ్చితివి. కుమారా, చిరంజీవివై వర్ధిల్లుము. నీకేమి కావలయు?

జమదగ్ని:— తండ్రీ మీ యాశీర్వాద బలమున్న నాకింకేమి కావలయు?

జమదగ్ని:— అయిన నిది యగుంగాక.

(భరత వాక్యము)

మ॥ శివునింబోలెను శిష్యవత్సలత వాసింగాంత్రుగాకొజ్జ, లు
ర్వివిభుల్ గర్వముమాని సాధువులఁ బేర్మిం బ్రోచెదగ్గాత, స
త్కవివాగ్గుంభన లీసుమాని సరసుల్ గైకొండ్రుగా కార్యధా
త్రి విచిత్రోరుర మానవిత్రి యగుచుర్ దీపించెడుం గావుతన్.

Printed at the B. N. K. Press, Madras—Q. H. No. Ms. 100/B.
For Q. H. No. 35/D — 1000—3-46.

7. అమృత కలశము (శ్రీకృష్ణ — — పాదకము) వెల 0-8-0

"శ్రీరామకృష్ణయ్యగారు చిన్నదొంగను కన్నులలో మెదలించుకొను కమ్మటికవులు. మురళీకృష్ణయ్యపై కవితయన్న ఒక వెన్నెలరాత్రి - ఒక అమృత నిర్ఝరిణి యని వేఱుగా చెప్పనక్కఱలేదు గదా! రామకృష్ణయ్యగారును ఆ గోపాల బాలునిలో లీనమై భారతకృష్ణుని ప్రస్తుతించి, గీతాకృష్ణునికి కేలుమోడ్చి యర్చించినా రీగ్రంథంలో - హృద్యమగు కవిత - ఉత్సాహవంతమైన నడక: మచ్చునకొక పద్యము చూపుదునా?

గీ॥ మోవి మురళి మ్రోయ, మూపు చిక్కము మోయఁ,
జెంచు కురుల నెమిలి పించె మలర,
నవ్వు మోముతోడ, నా చిత్త ముకురాన
నొదిగి ప్రతిఫలింపు మోయి కృష్ణ!!

—కృష్ణా పత్రిక.

8. ప్రేమ లీల (శ్రీ మామిడిపూడి - రామకృష్ణయ్య, మోచర్ల - రామకృష్ణయ్య కలసి రచించిన పాంఘిక నాటకము) ,, 0-12-0

"ప్రేమలీల చదివితిని. రసవంతముగా నున్నది.... కరుణరస ఘట్టముల - కొన్ని సందర్భముల కన్నీరు గార్చితిని - ముద్దుగా వ్రాసియున్నారు."—

T. Raghava, Bellary.

9. ఛత్రపతి శివాజి. (అముద్రిత నాటకము)

For copies apply to:—

మోచర్ల రామకృష్ణయ్య, [illegible],
అత్తికోట అగ్రహారము, [illegible]